
మనం
జనం కోసం అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ | సంపుటి: 3 • సంచిక: 4 • పేజీలు: 8+8 • వెల: రూ.5 | మంగళవారం • 1-1-2019 | www.manamnews.com | /manamnews



రాజ్యసభలోనే 'ట్రిపుల్ తలాక్'

విపక్షాల ఆందోళన.. రాజ్యసభ వాయిదా

బిల్లును సెలక్ట్ కమిటీకి పంపాల్సిందే

కాంగ్రెస్ సహా ఇతర విపక్షాల పట్టు

సభలో తీవ్రమైన గందరగోళం.. వాయిదా

5లో..



పాక్ దళాల ఆటకట్టు

నియంత్రణ రేఖ వెంబడి కాల్పులు

ఇద్దరు పాక్ ముష్కరులు హతం

నిఘాను బలోపేతం చేసిన ఆర్మీ

ప్రతి పంటకు డిమాండ్ రావాలె

ఫుడ్ ప్రాసెసింగ్‌లో తెలంగాణ ముందుండాలె



రాష్ట్రాన్ని పంటల కాలనీలుగా విభజించాలె

సాగు లాభసాటి కావాలె.. రైతు రాజ్యం తేవాలె..

ఆహారశుద్ధి పరిశ్రమకు అధిక ప్రోత్సాహం

త్వరలోనే అశోక్ గులాటితో 'అగ్రి' వర్క్‌షాప్

మన ఆర్థిక పరిస్థితి బ్రహ్మాండంగా ఉంది

ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమపై సమీక్షలో సీఎం కేసీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 31 (మనం ప్రతినిధి):

ఆహార, వ్యవసాయ రంగానికి సంబం. దించిన పలు విషయాల్లో సరైన గణాంకాలు లేనందున రకరకాల సమస్యలు తలెత్తుతు న్నాయని, వీటిని తక్షణమే పరిష్కరించాల్సిన ఆవశ్యకత ఉందని ముఖ్యమంత్రి కే చంద్రశే ఖరరావు అన్నారు. రైతుల సంప్రదాయబ ద్ధమైన కొన్ని అలవాట్లలో కొంతమార్పు రావలసిన అవసరం వుందని పేర్కొన్నారు. రైతులందరూ మిగతా 2లో..

నూతన సంవత్సర శుభాకాంక్షలు

సిడ్నీలో న్యూ ఇయర్ జోష్...



వెలుగు జిలుగులతో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతున్న సిడ్నీ హర్బర్

కొత్త ఏడాది అందరికీ సుఖ సంతోషాలివ్వాలె

నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన సీఎం

కొత్త ఏడాది ప్రజలందరికీ సుఖ సంతోషాలివ్వాలని రాష్ట్ర ముఖ్యమంత్రి, టీఆర్ఎస్ అధ్యక్షులు కేసీఆర్ ఆకాంక్షించారు. తెలంగాణ వారికి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. పాత సంవత్సరపు మంచిని కొనసాగిస్తూ, కొత్త సంవత్సరం మరింత ఆశాజనకంగా ఉండాలని సీఎం ఒక ప్రకటనలో తెలిపారు. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు పలువురు మాజీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేశారు.

ముహూర్తం

శ్రీ చాంద్రమాన విళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిరమాసం; తిథి: బహుళపక్షం ఏకాదశి రా.3.46 వరకు; తదుపరి: ద్వాదశి; నక్షత్రం: స్వాతి ఉ.11.52 వరకు; తదుపరి: విశాఖ; వర్జ్యం: సా.5.30 నుంచి 7.07 వరకు; దుర్ముహూర్తం: ఉ.8.44 నుంచి 9.28 వరకు; తదుపరి: రా.10.43 నుంచి 11.35 వరకు; రాహుకాలం: ప.3.00 నుంచి 4.30 వరకు; యమగండం: ఉ.9.00 నుంచి 10.30 వరకు; అమృతఘడియలు: రా.3.10 నుంచి 4.44 వరకు;

వాతావరణం



మంగళవారం కూడా చలిగాలుల తీవ్రత కొనసాగనుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువ స్థాయిలోనే ఉంటాయి.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 27 డిగ్రీలు
కనిష్ఠ ఉష్ణోగ్రత: 16 డిగ్రీలు
గాలి వేగం: గంటకు 11 కి.మీ.

ఓటమి భయంతో ఏదేదో మాట్లాడ్తుండు

కేసీఆర్ ప్రశ్నలకు జవాబు దాటవేస్తెందుకే మాటలు




ఏపీ సీఎం చంద్రబాబుపై జగదీశ్‌రెడ్డి, బాల్క సుమన్ ఫైర్

అబద్ధాలు మానకపోతే ఏపీ ప్రజలే కర్రుకాల్చి వాతపెడ్తరు

మోదీతో, బీజేపీతో టీఆర్ఎస్‌కు రాజకీయ బంధాల్లేవ్

కేంద్ర,రాష్ట్రాల మధ్య రాజ్యాంగ సంబంధమే..

పూటకో విధానంతో చంద్రబాబు ముందుకువోతుండు

ఎన్టీఆర్‌ను గద్దె దించితే కేసీఆరే సీఎం అయ్యేవారు కదా?

మీడియా సమావేశంలో ఏపీ సీఎంపై ఎమ్మెల్యేల విమర్శలు

2లో..



హైకోర్టు విభజనకు లైన్‌క్లియర్!

విభజన నిలిపివేతకు సుప్రీంలో పిటిషన్

సత్వర విచారణకు ధర్మాసనం నిరాకరణ

జనవరి 2 తర్వాతే విచారిస్తామని వెల్లడి

నేడు హైకోర్టు న్యాయమూర్తుల ప్రమాణం

న్యూఢిల్లీ, డిసెంబరు 31:

ఉమ్మడి హైకోర్టు విభజనకు లైన్ క్లియర్ అయింది. భవన నిర్మాణం పూర్తయ్యేవరకు మిగతా 2లో..

నదుల పునరుజ్జీవంపై కార్యాచరణ ప్రణాళిక



15లోగా ముసాయిదా రూపొందించండి

సంబంధిత శాఖలు 'నీరి'కి డేటా అందించాలి

నదుల పునరుజ్జీవ కమిటీ సమావేశంలో సీఎస్ జోషి

నీటి నాణ్యతను మానిటరింగ్ చేయాలని ఆదేశం

3లో..

ఇదీలోకం!



ఈ రోజే ఆఖరు.. రేపట్నుంచి మందు ముట్టనని, అబద్ధాలాడనని.. ప్రతి ఏడాదీ ఇట్టే అంటరు... మన పెండ్లయిన 40 ఏండ్ల నుంచి సూస్తనే ఉన్న..

బంగ్లాపీఠంపై మళ్లీ హసీనా

పార్లమెంటు ఎన్నికల్లో ఘన విజయం



300 స్థానాల్లో 288 అధికార కూటమికే

ప్రధాన ప్రతిపక్షానికి కేవలం 6 స్థానాలే..

అక్రమాలు జరిగాయంటున్న విపక్షకూటమి

ఫలితాలు రద్దుచేసి తాజా ఎన్నికకు డిమాండ్

వరుసగా మూడోసారి హసీనాకు అధికారం

ఢాకా, డిసెంబరు 31:

బంగ్లాదేశ్‌లో జరిగిన ఎన్నికల్లో ప్రధాని షేక్ హసీనా మరోసారి భారీ విజయం సాధించారు. ప్రతిపక్షాలు రిగ్గింగ్ జరిగినట్లు మిగతా 2లో..



కుంతియాపై కాంగ్రెస్ నేతల ఫైర్

ఎన్నికల్లో ఓటమిపై సమీక్షా సమావేశంలో మండిపాటు


టీడీపీతో కూటమి కట్టడం కొంపముంచింది

అభ్యర్థుల ప్రకటన జాప్యంతోనే పార్టీ ఓటమి

హైదరాబాద్, డిసెంబర్31 (మనం ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ డాక్టర్ రామచంద్ర కుంతియాకు పార్టీ మిగతా 2లో..

తిరుమలలో ఆర్జితసేవలు రద్దు ప్రత్యేక దర్శనాలు కూడా...

2లో..



తిరుమలలో ఆర్జితసేవలు రద్దు

ప్రత్యేక దర్శనాలు కూడా...

కొత్త సంవత్సరం రద్దీతో నిర్ణయం

తిరుమల, డిసెంబరు 31: కొత్త సంవత్సరం సందర్భంగా భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని, అందువల్ల తిరుమల శ్రీవారి ఆలయంలో రెండు రోజుల పాటు ఆర్జిత సేవలు, ప్రత్యేక దర్శనాలు రద్దు చేస్తున్నామని తిరుమల తిరుపతి దేవస్థానం తెలిపింది. డిసెంబరు 31, జనవరి ఒకటో తేదీల్లో ఈ సేవలు ఉండవని స్పష్టం చేసింది. భక్తుల రద్దీ కొనసాగుతున్న నేపథ్యంలో వీఐపీ బ్రేక్ దర్శనాల కోసం ఇచ్చే సిఫార్సు లేఖలను జనవరి 6వ తేదీ వరకు రద్దుచేశారు. ప్రోటోకాల్ ప్రముఖులకు మాత్రమే బ్రేక్ దర్శనాలను పరిమితం చేశారు. అయితే ఇతర ప్రత్యేక దర్శనాలతో పాటు ఆర్జిత సేవలు కూడా జనవరి 2 నుంచి యథాతథంగా కొనసాగుతాయని చెప్పారు.

హైకోర్టు విభజనకు లైన్‌క్లియర్!

(మొదటిపేజీ తరువాయి)

హైకోర్టు విభజనను నిలిపివేయాలంటూ దాఖలైన హౌస్‌మోషన్ పిటిషన్‌పై సత్వరమే విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు ధర్మాసనం నిరాకరించింది. జనవరి 2వ తేదీన సుప్రీంకోర్టు తిరిగి తెరుచుకోనుంది. ఆ రోజున ఈ పిటిషన్‌పై విచారణ చేపడతామని సుప్రీంకోర్టు పేర్కొన్నట్టు తెలుస్తోంది. మరోవైపు తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టుకు సోమవారమే ఆఖరిరోజు. దీంతో హైకోర్టు విభజన ప్రక్రియ యథాతథంగా కొనసాగనుంది. సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం విభజన ప్రక్రియ సాగనుంది. మంగళవారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మరోవైపు ఉమ్మడి హైకోర్టు విభజన, తరలింపు ప్రక్రియకు అనుమతిస్తూ.. సుప్రీంకోర్టు జారీచేసిన నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం పిటిషన్ వేసింది. సుప్రీంకోర్టు రిజిస్టర్ వద్ద దాఖలైన ఈ పిటిషన్‌పై జనవరి 2న విచారణ చేపట్టనున్నట్టు సుప్రీంకోర్టు పేర్కొంది.

హైకోర్టు జడ్జిలు సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో అమరావతికి చేరుకున్నారు. వారికి అధికారులు స్వాగతం పలికారు. విజయవాడలోని ఒక హోటల్లో వారికి బస ఏర్పాటుచేశారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు హైకోర్టు న్యాయమూర్తులు ప్రమాణస్వీకారం చేయనున్నారు. తెలుగు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ వారితో ప్రమాణస్వీకారం చేయిస్తారు. ఇందిరాగాంధీ స్టేడియంలో ప్రమాణస్వీకారం చేయించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

కుంతియాపై కాంగ్రెస్ నేతల ఫైర్

(మొదటిపేజీ తరువాయి)



నేతల నుంచి షాక్ ఎదురైంది. పార్టీ ఓటమికి ఆయనే ప్రధాన బాధ్యత వహించాలని శాసనసభ ఎన్నికల్లో ఓడిన అభ్యర్థులు మండిపడ్డారు. సోమవారం గోల్కొండ హోటల్‌లో ఎన్నికల్లో ఓటమిపై కుంతియా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షులు ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మండలిలో విపక్ష నాయకుడు మహ్మద్ అలీ షబ్బీర్, పద్మావతి, దాసోజు శ్రవణ్, మల్‌రెడ్డి రంగారెడ్డి, మల్లు రవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ ఓటమికి అధికార టీఆర్ఎస్ పార్టీ ఈవీఎం మిషన్ల ట్యాంపరింగ్‌తో పాటు పార్టీ పర వైఫల్యాలు కూడా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. టీడీపీతో కూటమిగా ఏర్పడడం కొంపముంచిందని చెప్పారు. అభ్యర్థుల ప్రకటనలో జాప్యం జరగడం కూడా మరొక కారణంగా తెలిపారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లోనైనా ఇప్పుడు జరిగిన పొరపాట్లు జరగకుండా చూడాలని కోరారు. మొత్తంమీద ఓడిపోయిన అభ్యర్థులు కుంతియానే ప్రధానంగా టార్గెట్ చేసుకుని విమర్శలు గుప్పించినట్లు తెలిసింది.

ప్రతి పంటకు డిమాండ్ రావాలె

మొదటిపేజీ తరువాయి)



ఒకే రకమైన పంటలు వేయటం వల్ల జరిగే లాభనష్టాలను క్షణ్ణంగా అధ్యయనం చేయవలసి ఉందన్నారు. రైతులను సంఘటిత పరచటం ద్వారానే గొప్ప ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. రాష్ట్రాన్ని ఖచ్చితంగా పంటల కాలనీగా విభజించాలని అధికారులకు సూచించారు. రైతు పండించే ప్రతి పంటకు డిమాండ్ లభించేలా చూడాలని ఆదేశించారు. రాష్ట్రంలో నెలకొల్పబోయే పుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా ప్రభుత్వ పరంగా నమ్మకమైన, కల్తీరహిత బ్రాండెడ్ ఉత్పత్తులు జరగాలన్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల మీద కోట్లాదిమంది అధారపడి వున్నారని, వారి ఆశయాలకు అనుగుణంగా ఆ శాఖలు పనిచేయాలని, దేశం మొత్తంలోనే ఉత్తమమైన వ్యవసాయ, ఉద్యానవన, పుడ్ ప్రాసెసింగ్, ఎగుమతులలో తెలంగాణ అగ్రభాగన వుండాలని ముఖ్యమంత్రి అన్నారు. పుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ అభివృద్ధిపై సోమవారం ప్రగతిభవన్ లో ముఖ్యమంత్రి అధ్యక్షతన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ, ప్రధాన కార్యదర్శి ఎస్.కె. జోషి, ఆర్థిక శాఖ కార్యదర్శి రామకష్ణారావు, సీఎంఓ అధికారులు నర్సింగ్ రావు, భూపాల్ రెడ్డి, స్మితాసభర్వాల్, డిజీపి మహేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు అనురాగ్ శర్మ, మాజీ మంత్రి చెరుకు ముత్యం రెడ్డి, టిఎస్ఐఐసి చైర్మన్ గ్యాదరి బాలమల్లు, శాసనమండలి చీఫ్ విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు మహేశ్వర్ రెడ్డి, ఆనంద్, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి, పరిశ్రమల ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, వ్యవసాయ ఉద్యానవన శాఖ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ' ఈ సమీక్షా సమావేశం పుడ్ ప్రాసెసింగ్ కు సంబంధించిన అంశాలపై ఒక అవగాహనకు రావటానికి ఏర్పాటయింది. దురదృష్టవశాత్తు చాలా విషయాల్లో సరైన గణాంకాలు లేకపోవటంవల్ల, సరైన నిర్ణయానికి రావటం కష్టమవుతున్నది. సరైన గణాంకాలు ఉండాలి. దీనికొరకు ఎమి చేయాలో ఆలోచించాలి. దీని ద్వారా రైతుల్లో అశాంతి పూర్తిగా తొలిగిపోతుంది. దీనికి మొదటి అడుగుగా రైతు సమన్వయ సమితుల ఏర్పాటు జరిగింది. వాళ్లకు క్రమపద్ధతిలో శిక్షణనివ్వాలి. తరువాత వ్యవసాయ విస్తరణాధికారులను నియమించడం జరిగింది. భూమి లెక్కలు కూడా తేల్చటం జరిగినందున వ్యవసాయ అనుకూల భూమి ఎంతుందో తేలింది. ఇదంతా ఒక గొలుసుకట్టు కార్యక్రమంలాగా జరిగితే తద్వారా వ్యవస్థ బాగుపడితే చాలామంచిది'' అని సీఎం అన్నారు. ''రైతులందరూ ఒకే రకమైన పంట వేస్తే సమస్యలు తలెత్తుతాయి కనుక పంట మార్పిడి కొరకు వాళ్లకు అవగాహన కల్పించాలి. ముల్కనూరు గ్రామం అనుభవాన్ని ఆదర్శంగా తీసుకోవాలి. అక్కడ సహకార పద్ధతిలో రైతులను సంఘటిత పరచడం ద్వారా గొప్ప ఫలితాలు సాధించడం జరిగింది. వ్యవసాయ ఆర్థిక శాస్త్రవేత్త అశోక్ గులాటిని డిల్లీలో కలిసి ఈ విషయాలలో వర్క్ షాప్ నిర్వహించాలని మన రాష్ట్రానికి ఆహ్వానించాను. త్వరలో ఆయన మన రాష్ట్రానికి వస్తారు'' అని సీఎం చెప్పారు . ''రాష్ట్రాన్ని ఖచ్చితంగా పంట కాలనీలుగా విభజించాలి. రైతు పండించే పంటకు డిమాండ్ ఉండాలె. రైతాంగంపై మన అభిప్రాయాలను రుద్దకుండా అంచెలంచెలుగా పంట కాలనీల విషయంలో అవగాహన కలిగించాలె. గ్రామీణ ఆహార అవసరాలతో పాటు, నగర-పట్టణ ప్రజల ఆహార అవసరాలకు తగు విధంగా ఉత్పత్తులు జరగాలె. కూరగాయలు, కొత్తిమీర, జీలకర్ర లాంటివి కూడా దిగుమతులు చేసుకోవడం దురదృష్టకరం. నగరాల-పట్టణాల దరిదాపుల్లో కూరగాయల పెంపకం జరగాలె. వచ్చే వానకాలం కల్లా కాళేశ్వరం నీళ్లు వస్తాయి. కొత్త ఆయకట్టు వస్తుంది. రాబోయే రెండు సంవత్సరాల్లో నీటి పారుదల ప్రాజెక్టులన్నీ పూర్తయి కోటి ఎకరాలకు పైగా సాగునీరందుతుంది. భూగర్భ జలాలు పెరుగుతాయి. చెరువులు నిండుతాయి. ఈ నేపథ్యంలో ఎటువంటి భూమిలో ఎలాంటి పంట వేయాలో రైతులకు అవగాహన కలిగించాలె'' అని అన్నారు.'ఎటువంటి రకమైన వ్యవసాయ ఉత్పత్తినైనా ప్రాసెస్ చేస్తే దాని ధర పెరుగుతుంది. మనం గనక మార్కెట్లో ఒక బ్రాండ్ నేమ్ మన పుడ్ ప్రాసెసింగ్ ఉత్పత్తులకు అదీ ప్రభుత్వ పరంగా తయారైన వస్తువన్న నమ్మకం కలిగించాలె. మన ఆలోచనలను కార్యరూపంలో తీసుకుని వచ్చి అమలు పరచాలె. ఈ ప్రక్రియలో ఐకెపి-మహిళా సంఘాలను భాగస్వాములను చేయాలి. 130 కోట్ల ప్రజలున్న మన దేశం పెద్ద దేశీయ మార్కెట్. ఏ రాష్ట్రంలో ఏది పండదో దాన్ని విశ్లేషించి మన వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా వాటిని పండించగలగాలె. తద్వారా పుడ్ ప్రాసెసింగ్ ఉత్పత్తులను తయారు చేయాలె. దేశ విదేశాల్లో అత్యుత్తమమైన పుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ ఎక్కడుందో గుర్తించి అలాంటిది మన రాష్ట్ర వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఏర్పాటు చేసుకునే విషయం అధ్యయనం చేయాలె'' అని చెప్పారు. ' రైతులు నియంత్రిత విధానంలో పంటలు పండించేలా చూడాలి. ప్రతి కుంట భూమిలో ఏ విత్తనం పెడుతున్నామో వ్యవసాయ శాఖకు తెలవాలె. మంచి మేలు రకమైన విత్తనాలు రైతులకు ఇవ్వాలె. వ్యవసాయ విశ్వ విద్యాలయంలో తదనుగుణమైన పరిశోధనలు జరగాలె. అంతర్జాతీయ విపణిలో మన భారతదేశ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్ చేసుకోలేని పరిస్థితిలో వుండటం దురద ష్టకరం. దీన్ని అధిగమించటానికి ప్రయత్నం జరగాలె. ప్రతి గ్రామం ఆ గ్రామ ప్రజల అవసరాలు తీర్చే స్థాయిలో కూరగాయలు పండించాలె. మిగులు కూరగాయలు సమీపంలోని నగరాలు-పట్టణాలకు సరఫరా చేయాలె'' అని ముఖ్యమంత్రి అన్నారు.

ఆర్థిక పరిస్థితి బ్రహ్మాండం.. జీఎస్టీలో ప్రథమ స్థానం

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బ్రహ్మాండంగా వుందని, గత నాలుగు సంవత్సరాల్లో సగటున 17.17 శాతం వ ద్ధిరేటును సాధించామని, ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 29.97 శాతం వృద్ధిరేటు వుందని, జీఎస్డిపీలో ప్రథమ స్థానంలో వున్నామని ముఖ్యమంత్రి అన్నారు. వచ్చే అయిదేళ్లలో రూ. 10 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేయబోతున్నామని, అన్నీ విధాల మన పెరుగుదలకు అవకాశాలున్నాయని, అందుకే మూస పద్ధతిలో ఆలోచించకుండా నూతన వరవడికి సిద్ధం కావాలని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సమావేశంలో జరిగిన చర్చల ప్రాతిపదికగా ఆలోచనలు పంచుకుని ఎలా ముందుకు పోవాలో నిర్ణయించాలని అధికారులను కోరారు. ఈరోజు జరిగిన సమీక్ష ఆధారంగా అధికారులు వివిధ స్థాయిల్లో మేధో మదన కార్యక్రమాలను, వర్క్ షాపులను నిర్వహించాలని సీఎం సూచించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న పుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమకు సంబంధించిన అంశాలను కూడా అధ్యయనం చేయాలని కేసీఆర్ సూచించారు. ఎంత ఖర్చు పెట్టడానికైనా ప్రభుత్వం వెనకాడదని తెలిపారు. పుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమకు సంబంధించి ఒక కార్యాచరణ పథకాన్ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. 4 లక్షలకు పైగా ఐకెపి మహిళా సంఘాల సభ్యులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని సిఎం చెప్పారు.

బంగ్లాపీఠంపై మళ్లీ హసీనా

(మొదటిపేజీ తరువాయి)

ఆరోపించినా.. ఆమె నేతృత్వంలోని అవామీ లీగ్ పార్టీ, దానికి అనుబంధంగా ఉన్న ఇతర పార్టీలు కలిపి 300 మంది సభ్యులుండే పార్లమెంటులో 288 స్థానాలు కైవసం చేసుకున్నాయి. ప్రధాన ప్రతిపక్షం కేవలం ఆరు స్థానాలకు మాత్రమే పరిమితమైందని ఎన్నికల కమిషన్ కార్యదర్శి హెలాల్ ఉద్దీన్ అహ్మద్ తెలిపారు. బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ నేతృత్వంలోని ప్రతిపక్ష కూటమి మాత్రం ఎన్నికల్లో అక్రమాలు జరిగాయంటూ.. ఫలితాలను రద్దుచేసి మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండు చేసింది. తటస్థ ప్రభుత్వం నేతృత్వంలో వీలైనంత త్వరగా మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని ప్రతిపక్ష కూటమి నాయకుడు కమల్ హొసైన్ మీడియాతో అన్నారు.

బంగ్లా ఎన్నికల ప్రచారం సందర్భంగా ఇరు వర్గాల మధ్య వర్గవైషమ్యాలు తీవ్రస్థాయిలో పెచ్చరిల్లాయి. పోలింగ్ జరిగేవరకు అవి కొనసాగుతూనే ఉన్నాయి. దాంతో పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు వీలుగా ఎన్నికల అధికారులు 6 లక్షల మంది భద్రతా సిబ్బంది, పోలీసులను మోహరించి పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటుచేశారు. అవామీ లీగ్, బీఎన్‌పీ మద్దతుదారుల మధ్య జరిగిన ఘర్షణలలో 13 మంది మరణించారు. మరో ముగ్గురు వ్యక్తులు పోలింగ్ కేంద్రాలలోకి చొచ్చుకొచ్చేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు జరిపిన కాల్పుల్లో మరణించారు.

చాలా పేద దేశంగా ఉండే బంగ్లాదేశ్‌లో ఆర్థిక వృద్ధి సాధించినందుకు, పొరుగుదేశమైన మయన్మార్‌లో సైనిక అణిచివేతకు గురైన రోహింగ్యా ముస్లిం వలసదారులను తమ దేశంలోకి స్వాగతించినందుకు షేక్ హసీనా (71)కి మంచి పేరు వచ్చింది. దాదాపు దశాబ్ద కాలంగా ఆమే అధికారంలో ఉన్నారు. ప్రతిపక్ష బీఎన్‌పీ నాయకురాలు బేగం ఖాలిదా జియా ప్రస్తుతం అవినీతి ఆరోపణలతో 17 సంవత్సరాల జైలుశిక్ష అనుభవిస్తున్నారు. ఇలా ప్రతిపక్షాన్ని పూర్తిగా అణిచేసి షేక్ హసీనా ఏకఛత్రాధిపత్యం వహిస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేవు. హసీనా పార్టీ బ్యాలెట్‌బాక్సులను తారుమారుచేసి, ఫలితాలను తమకు అనుకూలంగా మార్చుకున్నారని బీఎన్‌పీ కూటమి ఆరోపించింది. మొత్తం 300 సీట్లకు గాను 221 స్థానాల్లో అక్రమాలు జరిగాయని బీఎన్‌పీ అధికార ప్రతినిధి సయ్యద్ మొజ్జెమ్ హొసైన్ అలాల్ మీడియాకు తెలిపారు. ఓటర్లను పోలింగ్ కేంద్రాలలోకి వెళ్లనివ్వలేదని, ముఖ్యంగా మహిళా ఓటర్లతో బలవంతంగా పడవ గుర్తుకు ఓటు వేయించారని అన్నారు. పడవగుర్తు అవామీ లీగ్‌ది. ఎన్నికల్లో అక్కడక్కడ కొన్ని అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయని, వాటిపై తాము విచారణకు ఆదేశించామని బంగ్లాదేశ్ ఎన్నికల కమిషన్ అధికార ప్రతినిధి ఎస్ఎం అసదుజ్జమన్ తెలిపారు. అయితే షేక్ హసీనా మాత్రం ఈ ఆరోపణలకు వెంటనే స్పందించ లేదు. దేశ రాజధాని నగరం ఢాకాలో ఓటింగ్ చాలావరకు ప్రశాంతంగానే జరిగింది. సైనికులు, పారామిలటరీ దళాలు వీధుల్లో పహరా కాయడం, చాలావరకు ట్రాఫిక్‌ను అనుమతించకపోవడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదు. అయితే రాష్ట్రాలలోని కొన్ని చోట్ల మాత్రం ఓటర్లను భయపెట్టినట్లు ఆరోపణలొచ్చాయి. అధికార పార్టీ కార్యకర్తలు తనను కొట్టారని అతైర్ రహమాన్ అనే వ్యక్తి నారాయణ్‌గంజ్ జిల్లాలో చెప్పారు. ఓటు వేయలేదని బాధ పడక్కర్లేదని, నీ తరఫున మేం ఓటు వేస్తామని వాళ్లు చెప్పారన్నారు. ఓటర్లను భయపెట్టేందుకు చాలాచోట్ల అశాంతి నెలకొందని ప్రతిపక్షం చెప్పింది. దేశవ్యాప్తంగా చాలాచోట్ల పోలింగ్‌శాతం తక్కువగా ఉందని ప్రిసైడింగ్ అధికారులు చెప్పారు. ప్రతిపక్ష నాయకులు కొందరు బలవంతంగా పోలింగ్ కేంద్రాల్లోకి ప్రవేశించి ఒకరిని చంపడంతో తాము ఆత్మరక్షణ కోసం జరిపిన కాల్పుల్లో ముగ్గురు మరణించినట్లు పోలీసులు తెలిపారు. వారిలో ఒక వ్యక్తి బ్యాలెట్ బాక్సు దొంగిలించే ప్రయత్నం చేశాడన్నారు.

స్వేచ్ఛాయుతమేనా?

హసీనా ఇంత భారీ విజయం సాధించడం వల్లే ప్రతిపక్షాలు గోల పెడుతున్నాయని నిపుణులు అంటున్నారు. తమ సానుభూతిపరులైన దాదాపు 15 వేల మందిని ఎన్నికల ప్రచారం సమయంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, దాంతో తాము ప్రజల మద్దతు కూడగట్టుకోలేకపోయామని ప్రతిపక్షం ఆరోపించింది. ఎన్నికల అక్రమాలకు పాల్పడటంతో 17 మంది ప్రతిపక్ష అభ్యర్థులను అరెస్టు చేశారు. మరో 17 మందిపై కేసులు ఉండటంతో వారిని అనర్హులుగా ప్రకటించారు. వీటన్నింటినీ ప్రభుత్వ అణచివేతగానే ప్రతిపక్షం చెబుతోంది. ప్రతిపక్షంపై సర్కారు ఉక్కుపాదం మోపడంతో వాళ్ల మద్దతుదారులు కనీసం ఓటు వేయడానికి కూడా ముందుకు రావడానికి భయపడ్డారని హ్యూమన్ రైట్స్ వాచ్, ఇతర అంతర్జాతీయ సంస్థలు తెలిపాయి. ఎన్నికల విశ్వసనీయతపై అమెరికా కూడా అనుమానాలు వ్యక్తం చేసింది. ఓటింగ్ ప్రక్రియ వీలైనంత వరకు స్వేచ్ఛగా ఉండేలా చూడాలని ఐక్యరాజ్యసమితి పిలుపునిచ్చింది.

ఒకప్పుడు మిత్రపక్షాల నేతలుగా ఉన్న హసీనా, ఖలీదా తర్వాతి కాలంలో బద్ధశత్రువులుగా మారారు. ఇప్పుడు హసీనా మరోసారి విజయం సాధించడంతో వరుసగా మూడోసారి ఆమె ప్రధాని పదవిని చేపడుతున్నట్లయింది. మొత్తమ్మీద ఇది నాలుగోసారి. బంగ్లాదేశ్ తొలి అధ్యక్షుడు షేక్ ముజిబుర్ రెహమాన్ కుమార్తె అయిన హసీనా.. 2014లో కూడా ఎన్నికల్లో గెలిచారు. అప్పుడు బీఎన్‌పీ వర్గాలు ఎన్నికలు స్వేచ్ఛగా జరగడం లేదంటూ బహిష్కరించడంతో ఆమె విజయం సులభమైంది.



ఓటమి భయంతో ఏదేదో మాట్లాడ్తుండు

హైదరాబాద్, డిసెంబరు 31, (మనం ప్రతినిధి): ఏపీ సీఎం చంద్రబాబుకు ఇప్పట్నుంచే ఓటమి భయం పట్టుకొని ఏదేదో మాట్లాడుతున్నారనీ.. ఆయన పరిస్థితి చూస్తుంటే ఆ రాష్ట్రంలో ఫలితాలు ఎలా ఉంటాయో ఇప్పుడే తెలిసిపోతోందని మాజీ మంత్రి ,ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ఎద్దేవా చేశారు. సోమవారం ఎమ్మెల్యే బాల్క సుమన్ తో కలసి తెలంగాణ భవన్లో ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ లేవనెత్తిన ప్రశ్నలకు బాబు సమాధానం చెప్పకుండా ఏవేవో మాట్లాడుతున్నారని వారు మండిపడ్డారు. బాబును ఎదుర్కొనేందుకు ముగ్గురు మోదీలు అవసరం లేదని, ఏపీ ప్రజలు సరిపోతారన్నారు. మోదీతో గానీ బీజేపీతో గానీ టీఆర్ఎస్‌కు ఎప్పుడూ రాజకీయ సంబంధాలు లేవన్నారు. టీఆర్ఎస్ పార్టీకి కేవలం రాజ్యాంగ బద్ధమైన సంబంధమే కేంద్రంతో ఉందన్నారు. చంద్రబాబు పూటకో విధానంతో ముందుకు పోతున్నారనీ జగదీశ్ రెడ్డి కౌంటర్ ఏటాక్ చేశారు. హై కోర్టుపై అఫిడవిట్ గురించి చంద్రబాబును మాట్లాడమని కేసీఆర్ అడిగితే వేరేది మాట్లాడుతున్నారన్నారు. ఎన్టీఆర్ ను గద్దె దించేందుకు కేసీఆర్ సూత్రధారి అయితే కేసీఆరే అపుడు సీఎం అయ్యేవారు కదా? అని వారన్నారు. చంద్రబాబు తన అబద్దాలతో ఏపీ ప్రజలను వంచిస్తున్నారని అన్నారు.

తెలంగాణ కోసం గొంగళి పురుగునైనా ముద్దు పెట్టుకుంటానన్న కేసీఆర్ అన్నట్లుగా ఆనాడు టీడీపీతో పొత్తు ఎత్తుకున్నమన్నారు. 2004లో కాంగ్రెస్ తో 2009లో టీడీపీతో పొత్తు పెట్టుకున్నది తెలంగాణ కోసమేనన్నారు. తెలంగాణ కోసం అన్ని పార్టీలను ఒప్పించిన ఘనత కేసీఆర్ దే నన్నారు. చివరకు చంద్రబాబును తెలంగాణ కోసం టీడీపీనీ ఒప్పించే టీడీపీతో కేసీఆర్ పొత్తు పెట్టుకున్నారనీ ఆయన చెప్పారు. 2004లో చంద్రబాబును కాంగ్రెస్ బండకేసి కొట్టిందన్నారు. ఇక, 2009లో టీఆర్ఎస్ తో పొత్తుకు ముందుకు వచ్చింది టీడీపీయేనన్నారు. చంద్రబాబు టీడీపీ సహా 36 పార్టీలను తెలంగాణ కోసం ఒప్పించిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందన్నారు. చంద్రబాబే కేసీఆర్ దారిలోకి వచ్చారనీ..కేసీఆర్ బాబు దారిలోకి రాలేదనీ వారన్నారు. కేసీఆర్ తన ప్రెస్ మీట్ లో బాబుతో పాటు మోదీని ఎండగట్టారనీ తెలిపారు. మొన్నటి ఎన్నికల్లో మోడీ కేసీఆర్ దోస్తీ అంటూ బాబు ఎంత చెప్పినా ప్రజలు టీఆర్ఎస్ ను ఆదరించారన్నారు. ఇక,రేపు ఏపీ లో కూడా అదే జరుగుతుందన్నారు.

తాత్కాలిక ప్రయోజనాల కోసం చంద్రబాబు లాగా కేసీఆర్ అబద్దాలు చెప్పలేదన్నారు. గోబెల్సే ఆశ్చర్యపడే రీతిలో బాబు అబద్దాలు ఆడుతున్నారనీ జగదీశ్ రెడ్డి మండిపడ్డారు. గోబెల్స్ సిద్ధాంతాలను తెలంగాణ తిరస్కరించిందన్నారు. ఏపీ కూడా తిరస్కరిస్తుందనీ జోస్యం చెప్పారు. రాష్ట్రాలు విడిపోయినా హై కోర్టు ఎందుకు కలిసి ఉండాలన్న కారణం బాబు చెప్పలేక పోయారనీ ఆయన నిలదీశారు. నాలుగున్నరేళ్లలో హై కోర్టు భవనం కూడా బాబు కట్టలేక పోయారంటు కౌంటర్ ఏటాక్ చేశారు. కేసీఆర్ తో చంద్రబాబు అభివృద్ధిలో పోటీ పడలేరన్నారు. ఎవరిని అడిగినా తెలంగాణ అభివృద్ధి గురించి చెబుతారనీ..మోడీ ,జగన్ లతో ఎలా వ్యవహరించాలో కేసీఆర్‌కు తెలుసన్నారు. పక్క రాష్ట్రాలతో సంబంధాల విషయంలో కేసీఆర్ రాజకీయ పరిణతితో వ్యవహరించారనీ జగదీష్ రెడ్డి చెప్పారు. అబద్ధాలు ఆడకపోతే బాబు కు ఏపి ప్రజలు కర్రు కాల్చి వాత పెడతరన్నారు. చంద్ర బాబు కేసీఆర్ ను చూయించి ఏపీలో ఓట్లు పొందాలనుకుంటే అది బాబు తెలివి తక్కువ తనమే అవుతుందనీ జగదీశ్ రెడ్డి హితవు పలికారు.

కౌసల్యామ్మకు ప్రముఖుల నివాళి



- **నెల్లూరు జిల్లా రామాపురంలో అంత్యక్రియలు**
- **హాజరైన వెంకయ్య, మంత్రులు, నాయకులు**

నెల్లూరు, డిసెంబరు 31 (మనం న్యూస్ బ్యూరో): ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు సతీ మణి ఉషారాణి తల్లి అల్లూరు కౌసల్యమ్మ అంత్యక్రియలను నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం రామాపురంలో సోమవారం నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, పలువురు ప్రముఖులు.. ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. వెంకయ్య నాయుడు, మంత్రులు పొంగూరు నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాని గోవర్ధన్ రెడ్డి, బీజేపీ నేతలు కర్నాటి ఆంజనేయరెడ్డి, సురేందర్ రెడ్డి పలువురు ప్రముఖులు.. కౌసల్యమ్మ భౌతికకాయాన్ని సందర్శించి ఆమెకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంతకుముందు నెల్లూరు నగరంలోని రుత్విక్ ఎంక్లేవ్‌లో ప్రజల సందర్శనార్థం ఆమె భౌతిక కాయాన్ని ఉంచారు. సాయంత్రం రామాపురంలోని వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు. అనారోగ్యంతో ఆదివారం చెన్నైలో ఆమె మృతి చెందిన సంగతి తెలిసిందే.

ఆర్టీసీలో సమ్మె సైరన్

విజయవాడ, డిసెంబరు 31:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో (ఏపీఎస్ఆర్టీసీ) సమ్మె సైరన్ మోగింది. తమ డిమాండ్లను పరిష్కరించా లని కోరుతూ గుర్తింపు కార్మిక సంఘం ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) నేతలు సోమవారం ఆర్టీసీ ఎండీ సురేంద్రబాబును కలిసి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సమ్మె నోటీసుకు స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కూడా మద్దతు ప్రకటించింది. ఈ నోటీసులో ఆర్టీసీ కార్మికులు తమ ప్రధాన డిమాండ్లను ప్రస్తావించారు. 50 శాతం వేతన సవరణతో పాటు అలవెన్సులు వంద శాతం పెంచాలని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని నోటీసులో పేర్కొన్నారు. సంస్థ నష్టాలను అధిగమించేందుకు వీలుగా ప్రభుత్వం తగినంత ఆర్థిక సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ఆర్టీసీ కార్మికులకు కూడా పదవీ విరమణ వయస్సు 60 ఏళ్లకు పెంచాలన్నారు. ఆర్టీసీ కొనుగోలు చేసే డీజిల్‌పై రాయితీ ఇవ్వాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ, కార్మికుల ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బలవంతంగా అమలుచేస్తున్న వీఆర్ఎస్ స్కీమ్ ఆపాలన్నారు. ఈ సమస్యలు పరిష్కరించకపోతే జనవరి 13వ తేదీ నుంచి సమ్మె చేస్తామని నోటీసులో పేర్కొన్నారు. ఒకవేళ అదే తప్పకపోతే.. సరిగ్గా సంక్రాంతి సమయంలో ప్రయాణికులు అటూ ఇటూ వెళ్లడానికి వీలులేకుండా పోయే ప్రమాదం ఉంది. అసలే పండుగ సమయంలో ప్రైవేటు ట్రావెల్స్ వాళ్లు టికెట్ రేట్లను పెంచేస్తుండగా, ఇప్పుడు ఆర్టీసీ బస్సులు లేకపోతే మరింతగా పెరిగే అవకాశం ఉంటుంది. సాధారణంగా సంక్రాంతి పండుగకు వివిధ రాష్ట్రాలలో ఉన్న తెలుగువాళ్లలో అత్యధికులు తమ సొంత ఇళ్లకు రావడానికి మొగ్గు చూపుతారు. ఇలాంటి సమయంలో ఆర్టీసీ బస్సులు లేకపోతే ఇబ్బందులు తీవ్రతరం అయ్యే ప్రమదం ఉంది. మొత్తం 18 రకాల డిమాండ్లతో ఆర్టీసీ ఎండీ ఎన్వీ సురేంద్రబాబుకు ఎంప్లాయీస్ యూనియన్ నేతలు సమ్మె నోటీసు ఇచ్చారు. ప్రభుత్వం స్పందించకుంటే అన్ని కార్మిక సంఘాలతో కలిపి జనవరి 4 న నూతన జేఏసీ ఏర్పాటు చేస్తామని, అందులోనే సమ్మె గురించిన తుది నిర్ణయం తీసుకుంటామని అంటున్నారు.

కేసీఆర్ సంక్షేమ పథకాలే విజయానికి
పునాదిగా మారాయి

• యుఎస్ఏలో ఘనంగా టీఆర్ఎస్ విజయోత్సవ సంబురాలు

హైదరాబాద్, డిసెంబరు 31, (మనం ప్రతినిధి): ఇటీవల తెలంగాణలో జరిగిన ఎన్నికలలో కేసీఆర్ భారీ విజయం సాదించిన సందర్భంగా టీఆర్ఎస్ పార్టీ గెలుపు సంబరాలను అమెరికాలోని ఆస్టిన్ నగరంలో జరుపుకోన్నారు. ఈ సంబరాల్లో, టీఆర్ఎస్ యుఎస్ఎ ఆస్టిన్ విభాగం ఆద్వర్యంలో సంబురాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అమెరికా టీఆర్ఎస్ కార్యదర్శి నాగుల వంచా నరసింహ్మారావు విచ్చేశారు. అనంతరం నరసింహ్మారావు మాట్లాడుతూ... కేసీఆర్ సారద్యంలో నాయకత్వ పఠిమ, అభివృద్ధి పథకాలు, కాళేశ్వరం ప్రాజెక్ట్ మొదలగు అమలైన బృహత్ ప్రణాళికలన్ని ఈ ఎన్నికల్లో పార్టీ ఘన విజయానికి ప్రధాన కారణమని ఆయన తెలిపారు. టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన కేటీఆర్‌కి శుభాకాంక్షలు తెలిపారు. టీఆర్ఎస్ విజయానికి కృషి చేసిన మహేశ్ కాసారపు, వేణు జూపల్లి, రాకేష్ వడ్లురి, శ్రీనాథ్ బొమ్మ, జగదీశ్ జొన్నాడ, నవీన్ నూతి, ప్రదీప్ భట్టిప్రోలు,శ్రీనాథ్ దాసరిలకు కృతజ్ఞతలు తెలియచేసారు. నూతనంగా ఏర్పడిన టీఆర్ఎస్-ఆస్టిన్ కార్యదర్శి హరీష్‌రెడ్డి వ్యాళ్ళ మాట్లాడుతూ... ఎవరెన్ని బూటకపు పన్నాగాలు పన్నినా కేసీఆర్‌కి తెలంగాణ ప్రజలు ఏక పక్ష విజయాన్ని అందిచడం శుభ పరిణామమన్నారు. తాను ప్రత్యక్షంగా మూడు నియోజక వర్గాల్లో టీఆర్ఎస్ పట్ల ప్రజల అనూహ్య స్పందన చూశానన్నారు. రోహిన్ రేవెల్లి, కిరణ్ గంద్ర, హరీష్ కొత్త, వెంకట్, నరేష్ రెడ్డి తాదురి మాట్లాడుతూ...ఆసరా, రైతు బంధు, షాదీ ముబారక్ లాంటి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రజలకు అందడం వల్ల తిరుగులేని విజయం సాధ్యమయిందన్నారు. వచ్చే ఐదేళ్లల్లో కేసీఆర్ ప్రభుత్వం ఎన్నో చేయవలసిన పనులు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో యుఎస్ఎ నేతలు మహేష్ తన్నీరు, మహేష్ బిగాల, పూర్ణచందర్ బైరి, నవీన్ జలగం నాయకులు టీఆర్ఎస్ ఎన్ఆర్ఐ నేతలు అనిల్ కూర్మాచలం టీఆర్ఎస్ ఆస్టిన్ విభాగం ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపింది.

తెలంగాణ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



• కొత్త ఏడాది అందరికి సుఖ సంతోషాలను ఇవ్వాలి: ఉత్తమ్

హైదరాబాద్, డిసెంబర్31(మనంప్రతినిధి) : తెలంగాణ ప్రజలకు టీపీసీసీ అధ్యక్షులు ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త ఏడాది అందరిలో సుఖ సంతోషాలను నింపాలని ఆకాంక్షించారు. పాత సంవత్సరంలో మంచిని కొనసాగిస్తూ, కొత్త సంవత్సరం మరింత ఆశాజనకంగా ఉండాలని ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నూతనోత్తేజంతో వచ్చే స్థానిక, పార్లమెంట్ ఎన్నికల్లో పని చెయ్యాలని ఉత్తమ్ పిలుపునిచ్చారు.

ఎఐసీసీ అధికార ప్రతినిధిగా
దాసోజు శ్రవణ్



• రాహుల్ న్యూ ఇయర్ గిఫ్ట్

హైదరాబాద్, డిసెంబర్ 31 (మనంప్రతినిధి): టీపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్‌కు ఎఐసీసీ అధ్యక్షులు రాహుల్ గాంధీ న్యూ ఇయర్ గిఫ్ట్ ఇచ్చారు. దాసోజు శ్రవణ్‌ను ఎఐసీసీ అధికార ప్రతినిధిగా నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. దేశ వ్యాప్తంగా 10 మందిని ఎఐసీసీ అధికార ప్రతినిధులుగా నియమించగా, తెలంగాణ నుంచి దాసోజు శ్రవణ్ ఉన్నారు.

రాహుల్‌కు కృతజ్ఞతలు : దాసోజు

తనను ఎఐసీసీ అధికార ప్రతినిధిగా నియమించినందుకు ఎఐసీసీ అధ్యక్షులు రాహుల్ గాంధీకి దాసోజు శ్రవణ్ కృతజ్ఞతలు తెలియజేశారు. అందుకు సహకరించిన టీపీసీసీ అధ్యక్షులు ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఇతర నేతలకు కూడా ధన్యవాదాలు తెలిపారు. తనపై ఉంచిన బాధ్యతలను చిత్తశుద్దితో నిర్వహిస్తానని, దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ వాణిని వినిపిస్తానని చెప్పారు.

బీమా కోరెగావ్ విజయ్ దివస్ ఉత్సవాలు
విజయవంతం చేయాలి



హైదరాబాద్, డిసెంబర్ 31 (మనం ప్రతినిధి): పీష్వా బ్రాహ్మణీయ మనువాదుల దోపిడీ సామ్రాజ్యాన్ని కూల్చి దళిత రాజ్యస్థాపన విజయ్ దివస్ జనవరి 1న మహారాష్ట్రలోని భీమా కోరెగావ్ నిర్వహించే విజయ్ దివస్ శౌర్య మహోత్సవాలను విజయవంతం చేయాలని దళిత బహుజన పార్టీ పిలులపునిచ్చింది.సోమవారం ఆపార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణస్వరూప్ మాట్లాడుతూ ప్రతి ఏటా జనవరి 1న నిర్వహించే విజయ దివస్ ఉత్సవాలకు దేశం నలుమూలల నుంచి లక్షలాదిమంది దళితులు, అంబేద్కర్ సంస్దలు పాల్గొంటాయన్నారు. బానిస సంకెళ్ల నుండి విముక్తి పొంది రోజని, ఉగాది పండుగ దళిత బహుజనలదికాదని, అది బ్రాహ్మణ వర్గాలదన్నారు. అణగారిన కులాల ప్రజలను బానిసలుగా చూసిన షీష్వా ఆర్యవర్గాల అగ్రకుల ఆధిపత్యరాజ్యాన్ని 28వేల మంది ఫీష్వా సైన్యాన్ని కేవలం 500మంది దళిత్ మహార్ వీరులు తరిమి తుదముట్టించారు. తద్వారా స్వేచ్ఛ, ఆత్మగౌరవం సమతా రాజ్యస్థాపనకు మహార్ రెజిమెంట్స్ పోరాడన్నారు. విజయ్ దివస్ జనవరి ఒకటిన పూణెదగ్గర ఉన్న బీమీ కొరగావ్ వద్ద మహార్ విజయ్ స్థూపం వద్ద మహార్ వీరులకు లక్షలాది మంది అణగారిన వర్గాల ప్రజలు ఘన నివాళులు అర్పిస్తూ ఉత్సవాలు నిర్వహిస్తారన్నారు. దేశ చరిత్రలో ఇదిఒక దళితుల విజయ్ చరిత్ర చారితాత్మకమన్నారు. కేంద్రంలో ఆర్ఎస్ఎస్, మోడీ ప్రభుత్వం, మహారాష్ట్ర సర్కార్ ఉత్సవాలకు అటంకం కల్గిస్తుందని విమర్శించారు.ఈపోరాట స్పూర్తితో, అంబేద్కర్ నడిపించిన సామాజిక న్యాయం, రాజ్యాంగ పోరాటానికి స్పూర్తిగా నిలిచిందన్నారు.

ఢిల్లీ మెట్రో విస్తరణ

న్యూఢిల్లీ, డిసెంబరు 31: ఢిల్లీ మెట్రో రైలును మరింతగా విస్తరించారు. లాజ్‌పత్ నగర్- మయూర్ విహార్ పాకెట్ 1 కారిడార్‌ను కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరి, ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోదియా పచ్చజెండా ఊపి ప్రారంభించారు. మెట్రోభవన్ ఆడిటోరియంలో సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. ఢిల్లీ మెట్రోలోని పింక్‌లైన్‌లో గల ఈ 9.7 కిలోమీటర్ల మార్గం సోమవారం సాయం త్రం 4 గంటల నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చింది.

నదుల పునరుజ్జీవంపై
కార్యాచరణ ప్రణాళిక

• 15లోగా ముసాయిదా రూపొందించండి • సంబంధిత శాఖలు 'నీరి'కి డేటా అందించాలి
• నదుల పునరుజ్జీవ కమిటీ సమావేశంలో సీఎస్ జోషి • నీటి నాణ్యతను మానిటరింగ్ చేయాలని ఆదేశం



హైదరాబాద్, డిసెంబరు 31, (మనం ప్రతినిధి): జనవరి 15 లోగా జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం నదుల పునరుజ్జీవంపై ఒక నిర్దిష్ట కాల పరిమితితో కూడిన ముసాయిదా కార్యచరణ ప్రణాళికను రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్కే జోషి ఆదేశించారు. ఈ సందర్భంగా సోమవారం సచివాలయంలో నదుల పునరుజ్జీవ కమిటీ సమావేశం సీఎస్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో అటవీ శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి అజయ్ మిశ్రా, మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి అర్వింద్ కుమార్, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్, మెట్రోవాటర్ వర్క్స్ ఎండి దానకిషోర్, పీసీబీ సెక్రటరి సత్యనారాయణ రెడ్డి, ఇపిటిఆర్ఐ కల్యాణ చక్రవర్తి, టిఎస్ఐఐసీ ఎండి వెంకట నర్సింహారెడ్డి, ఇరిగేషన్ ఇఎన్‌సీ మురళీదర్ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.యస్ ఎస్.కె.జోషి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి వివిధ నదులకు సంబంధించిన ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్, మెట్రో వాటర్ వర్క్స్, మున్సిపాలిటి, పరిశ్రమలు తదితరశాఖలు జనవరి 5 లోగా తమ డాటాను నేషనల్ ఎన్విరాన్ మెంటల్ ఇంజనీరింగ్ రిసెర్చ్ ఇన్సిట్యూట్ (నీరీ)కు అందజేయాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి మొత్తం నీళ్ల నిలువ ఉంచే చిత్ర పఠాన్ని రూపొందించాలని అన్నారు. దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా నీటి నాణ్యతను మానిటరింగ్ చేయాలని తెలిపారు. నదులలో కాలుష్యానికి సంబంధించి ముఖ్యమైన స్ట్రెచ్చెస్‌లపై ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. రాష్ట్రానికి సంబంధించి పీసీబీ ద్వారా నీటి నాణ్యత, ఇరిగేషన్ ద్వారా నీటి పరిమాణంపై అధ్యయనం చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్‌టీపీల నిర్మాణానికి సంబంధించి హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్‌ను నోడల్ వ్యవస్థగా నియమించడానికి ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. మొత్తం సీజన్‌కు సంబంధించిన మినిమమ్ పర్యావరణ సమతుల్యత పలితాలపై నివేదికను రూపొందించాలన్నారు. డ్రైనేజ్ వ్యవస్థకు సంబందించి భూగర్భజలాలు, తదితర అంశాలను దృష్టిలో ఉంచుకొని అన్నింటిపై జనవరి 3వ వారంలో నివేదిక రూపొందించాలన్నారు. అనంతరం వారు ఇచ్చె ముసాయిదా నివేదికపై మరోసారి కమిటి సమావేశం కావాలని అధికారులతో నిర్వహించిన సదస్సులో సీఎస్ ఎస్‌కే జోషి నిర్ణయించారు.

తెలుగు రాష్ట్రాలకు సీఎంలు చంద్రగ్రహణంలా మారారు



హైదరాబాద్, డిసెంబర్ 31 (మనంప్రతినిధి): ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రినన్న సంగతి మరిచిపోయి అమర్యాద, అహంభావతో సీఎం కేసీఆర్ మాట్లాడుతున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు డా. లక్ష్మన్ విమర్శించారు. తెలుగువారి మర్యాద, ప్రతిష్టను ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, సీఎం కేసీఆర్‌లు దిగజారుస్తున్నారన్నారు. ఇరు తెలుగు రాష్ట్రాలకు వీరిద్దరూ చంద్రగ్రహణంలా మారారని దుయ్యపట్టారు. సోమవారం తమ పార్టీ

డా. లక్ష్మణ్

కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోయిందని సీఎం కేసీఆర్ పదేపదే మాట్లాడుతున్నారని, కానీ టీఆర్ఎస్ మంత్రులు కూడ నలుగురు ఓడిపోయారని, కొన్నిచోట్ల టీఆర్ఎస్ పార్టీ అ భ్యర్దులకు డిపాజిట్ కూడా రాని విషయాన్ని ఆయన గుర్తు చేసుకోవాలన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, తాము గెలిచిన ఓడినా ప్రజల పక్షమేనన్నారు. దళితుడిని సీఎం చేస్తానని దగా చేసిన కేసీఆర్ ఇప్పుడు బీసీలను కూడ మోసం చేస్తున్నారన్నారు. బీసీ జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించవద్దని సుప్రీంకోర్టు తీర్పు స్పష్టంగా ఉన్నా ఐదేళ్లలో బీసీ జనాభా గణన ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. బీసీ ప్రధానిగా బీసీ జాతీయ కమీషన్‌కు రాజ్యాంగ బద్దత కల్పించింది మోదీ సర్కారేనని పేర్కొన్నారు. రాజకీయంగా బీసీలనుఅణగదొక్కేలా కేసీఆర్ చర్యలు ఉన్నాయని 34శాతం బీసీ రిజర్వేషన్లు వచ్చేవరకు ఇతర బీసీ సంఘాలతో పోరాటం చేస్తామని వెల్లడించారు.

హెచ్ఎండిఏ పరిధిలో పచ్చదనం పెంపుపై
సీఎం కేసీఆర్ సమీక్ష

హైదరాబాద్, డిసెంబర్ 31(మనం ప్రతినిధి): హెచ్ఎండిఏ పరిధి, పరిసరాల్లో పచ్చదనం పెంపు కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టాలని ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారులను ఆదేశించారు. హెచ్ఎండిఏ పరిధిలో పచ్చదనం పెంపు పైన ముఖ్యమత్రి సమీక్ష నిర్వహించారు. హెచ్ఎండిఏ కమిషనర్ జనార్ధన్‌రెడ్డితో పాటు సంబందిత అధికారులు సమీక్షలో పాల్గొన్నారు. దేశంలోని ఇతర నగరాల మాదిరిగానే హైదరాబాద్ కూడా కాంక్రీట్ జంగల్ కారాదని ముఖ్యమంత్రి సూచించారు. ఇక్కడ నివసించే వారు ప్రశాంతంగా జీవించడంతో పాటు భవిష్యత్ తరాలు సంతోషంగా జీవించేలా పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. హెచ్ఎండిఏ పరిధిలో వీలైనంత ఎక్కువ లంగ్ స్పేస్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాకర్స్ క్లబ్‌లు ఏర్పాటు చేసి నిర్వహణా బాధ్యతలు వారికి అప్పగించాలన్నారు. హైదరాబాద్ నుంచి మెదక్‌కు గతంలో ఉన్న తరహాలో అటవీ ప్రాంతాలను పునరుద్దరించాలన్నారు. బాహ్యావలయ రహదారి చుట్టూ ప్రాంతాల్లో పచ్చదనం అభివృద్ధి కోసం అటవీ శాఖతో కలిసి సమీకృత ప్రణాళిక రూపొందించాలని సూచించారు. హెచ్ఎండిఏ పరిధిలో పచ్చదనం పెంపునకు అధికారులు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు జరపాలని ఆదేశించారు.

13 నుంచి
ఇంటర్నేషనల్ స్వీట్ ఫెస్టివల్

• పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహణ



హైదరాబాద్, డిసెంబరు 31, (మనం ప్రతినిధి): ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్, స్వీట్ ఫెస్టివల్స్ సంబురాలు త్వరలో తెలంగాణ రాష్ట్రంలో ఘనంగా జరుగనున్నాయి. ఈ కొత్త సంవత్సరం జనవరి13 నుండి 15 వరకు (మూడు రోజులు) పాటు తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ లోని పరేడ్ గ్రౌండ్స్ వేదిక కానుంది. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్, స్వీట్ ఫెస్టివల్స్ సంబురాలు నిర్వహణ ఏర్పాట్లపై బేగంపేటలోని పర్యాటక భవన్ లో పర్యాటక, సాంస్క ృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం సోమవారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమీక్షా సమావేషానికి తెలంగాణలో నివసిస్తున్న వివిధ రాష్ట్రాల, దేశాలకు చెందిన సంఘాల ప్రతినిధులంతా విచ్చేశారు. గత సంవత్సరం నిర్వహించిన ఇంటర్నేషనల్ స్వీట్ ఫెస్టివల్ లో 1000 రకాల స్వీట్స్ ను ప్రదర్శించామనీ ఆయన పెర్కొన్నారు. ఈ ఫెస్టివల్ లో వివిధ రాష్ట్రాలతో పాటు 15 దేశాల ప్రతినిధులు వారి సాంప్రదాయ స్వీట్స్ తో స్వీట్ ఫెస్టివల్ లో సుమారు 8 లక్షల మంది సందర్శకులు పాల్గొన్నారన్నారు. వెయ్యి రకాల స్వీట్స్, వివిధ రకాల పతంగులను ఒకే వేదికపై చూడటానికి సందర్శకులు రావడంపై బుర్రా వెంకటేశం హర్షం వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం నిర్వహించే స్వీట్ ఫెస్టివల్ కు సుమారు 20 దేశాల ప్రతినిధులు స్వీట్ స్టాల్స్ ను ఏర్పాటు చేయనున్నామన్నారు. 10 లక్షల మంది సందర్శకులు వచ్చే అవకాశం ఉందని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని పర్యాటక, సాంస్క ృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం ఈ సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల ప్రతినిధులకు సూచించారు.

చంద్రబాబు కల్లు తాగిన కోతిలా ప్రవర్తిస్తున్నడు

• అధికారం కోసం అడ్డదారులు తొక్కింది ఆయనే
• వానలు కొడితే వాతలు పోవు .. బాబు పాత చరిత్రను ప్రజలు మర్చిపోరు
• ఎన్టీఆరే చంద్రబాబును జామాత దశమ గ్రహం అని విమర్శించిండు
• ఏపీలో కేసీఆర్‌కు వ్యక్తమైన ఆదరణను బాబు ఓర్చుకోలేకపోతుండు
• నీకు లాగా కేసీఆర్‌కు అండీలు గిండీలు, మీరు చెప్పే అ తొండీలు రావు
• కేసీఆర్ ధాటికి మహామహులే మట్టి కరిచిండ్రు.. బాబూ జాగ్రత్త
• ఎపీ సీఎం చంద్రబాబుపై నోముల నర్సింహ్మయ్య కౌంటర్ ఏటాక్



హైదరాబాద్, డిసెంబరు 31, (మనం ప్రతినిధి): తెలంగాణలో త్వరలో జరుగబోయే పంచాయతీ ఎన్నికల్లో 24 శాతం సీట్లు ఇవ్వాలని సుప్రీం కోర్టు చెప్పిన దానికి తెలంగాణ ప్రభుత్వం 24 శాతానికి ఒప్పుకోలేదని టీఆర్ఎస్ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య అన్నారు. ఈ సందర్భంగా సోమవారం తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో నోముల మాట్లాడుతూ...సుప్రీం స్పెషల్ లీవ్ పిటిషన్ కూడా వేసిందని ఆయన చెప్పారు. వేసిన పిటిషన్‌ని కూడా సుప్రీం కోర్టు కొట్టి వేయడంతో బాధాకర పరిస్థితుల్లో సీఎం కేసీఆర్ ఆ తీర్పును అంగీకరించారని నోముల పేర్కోన్నారు. అయితే, దానిపై ఉత్తమ్, కోదండరాం బీసీలపై మొసలి కన్నీళ్లు కారుస్తున్నారని ఆయన తనదైన శైలీలో మండిపడ్డారు. అధికారంలో ఉండగా కాంగ్రెస్ నేతలు బీసీ ఫెడరేషన్లకు ఒక్క పైసా కేటాయించలేదన్నారు. బీసీలకు 90 శాతం సబ్సిడీతో ఇప్పుడు పెట్టుబడి సమకూరుస్తున్నామని ఆయన తెలిపారు. బీసీలను అన్ని విధాల అణచివేసింది అ నేత లేనని ఆయన ఆరోపించారు. ఇప్పుడు మళ్లి అ నేతలే గొంతు పెద్దదిగా చేసుకుని మాట్లాడుతున్నారని నోముల ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని ప్రయత్నాలు విఫలమైన తర్వాతే బీసీలకు కోర్టు నిర్ణయించిన రిజెర్వేషన్లకు ఒప్పుకున్నామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నేతలకు దమ్ముంటే చట్టసభల్లో బీసీలకు 33 శాతం రిజ ర్వేషన్ల కోసం దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో తీర్మానాలు చేయించాలని నోముల డిమాండ్ చేశారు. విపక్ష నేతలు ఇల్లు కాలితే పేలాలు ఏరుకుంటున్నట్టుగా వ్యవహరిస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. డిల్లికి అఖిల పక్షంగా వెళ్లినా ప్రస్తుత పరిస్థితుల్లో సాధించేది ఏమి ఉండదంటు కౌంటర్ ఎటాక్ చేశారు. బీసీ నేత ఆర్. కృష్ణయ్య వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు.

తమిళనాడు తరహాలో తెలంగాణలో రిజర్వేషన్లు సాధించేందుకు అన్ని పార్టిలు సహకరించాలని యన కోరారు. బీసీలకు ఎవరేం చేశారో తేల్చుకునేందుకు ఉత్తమ్ దమ్ముంటే నాతో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. చంద్రబాబు కల్లు తాగిన కోతిలా ప్రవర్తిస్తున్నారంటూ నోముల తనదైన శైలీలో బాబుపై విరుచుకుపడ్డారు. కేసీఆర్ భాషను చంద్రబాబు తప్పు పడుతున్నారని...చంద్రబాబు లాగా కేసీఆర్‌కు అండీలు గిండీలు, ఆయనలా అ తొండీలు రావన్నారు. మోడీకి చంద్రబాబుకు ఏం పంచాయతీ ఉందో ..ఆ వివాదంలో కేసీఆర్‌ను బాబు ఎందుకు లాగుతున్నారో? ఆర్దం కావడం లేదన్నారు. ఎన్టీఆర్ యే స్వయంగా చంద్రబాబును జామాత దశమ గ్రహం అని విమర్శించారని ఆయన తెలిపారు. అధికారం కోసం అడ్డదారులు తొక్కింది చంద్రబాబేనంటూ నోముల ఈ సందర్భంగా ఫైర్ అయ్యారు. వానలు కొడితే వాతలు పోవు ..చంద్రబాబు పాత చరిత్రను మరిచి పోరని ఆయన ఘాటుగా విమర్శించారు. ఏపీలో కేసీఆర్‌కు వ్యక్తమైన ఆదరణను చూసి చంద్రబాబు ఓర్చుకోలేకపోతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ పాలనను చూసి విజయవాడలో కూడా ఆయన నిలువెత్తు విగ్రహం పెట్టాలనుకుంటున్నారని నోముల చెప్పారు. కేసీఆర్‌ను దేవుడిలా కొలిచే ప్రజలు తెలంగాణలో ఉన్నారని ఆయన చెప్పారు. కేసీఆర్ ధాటికి మహామహులే మట్టి కరిచారని నోముల వాఖ్యానించారు. ఇప్పటికైనా చంద్రబాబు తన పద్ధతిని మార్చుకోవాలని సూచించారు. ఇకనైనా బీసీలపై విపక్షాలు కుహనా రాజకీయాలు మానుకుంటే మంచిదని..లేకపోతే..మొన్నటి ఎన్నికల్లో వచ్చిన ఫలితాలనే మళ్లి చూస్తారని నోముల ప్రతి పక్ష నేతల తీరుపై తనదైన శైలీలో స్పందిస్తునే..వారిపై ఘాటుగా చురకలు అంటించారు.

విచారణను హత్య చేసింది ఎవరు?

• రాహుల్ గాంధీ ఈ ప్రశ్నవేయాలన్నజైట్లీ

న్యూఢిల్లీ, డిసెంబరు 31: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ''సొహ్రాబుద్దీన్ మరణంపై విచారణను ఎవరు హత్య చేశార''న్న ప్రశ్న రాహుల్ గాంధీ వేయాలని కేంద్ర ఆర్థికశాఖా మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు సీబీఐ వంటి సంస్థలను ఏం చేశారో కాంగ్రెస్ పార్టీ ఆత్మపరిశీలన చేసుకోవాలని జైట్లీ తన ఫేస్‌బుక్ ఆర్టికల్‌లో పేర్కొన్నారు. సంస్థల స్వతంత్ర వంటి విషయాలు లేవనెత్తే ముందు

అప్పట్లో రాజ్యసభలో విపక్ష నేతగా ఉన్న తాను ఈ అంశంపై ప్రధాని మన్మోహన్ సింగ్‌కు 2013, సెప్టంబరు 27న సొహ్రాబుద్దీన్, తులసీ ప్రజాపతి, ఇష్రత్ జహాన్, రాజిందర్ రాథోర్, హరేణ్ పాండ్యా హత్య కేసుల విచారణను ఎలా రాజకీయం చేశారో వివరంగా లేఖ రాసినట్టు జైట్లీ తన బ్లాగ్‌లో గుర్తుచేశారు. లేఖలో తాను పేర్కొన్న ప్రతి పదం ఆతరువాత ఐదేళ్లలో అక్షర సత్యమైందని, దర్యాప్తు సంస్థలను కాంగ్రెస్ ఏ గతి పట్టించిందో అన్న విషయానికి తన లేఖ నిలువెత్తు సాక్ష్యమని ఆయన మండిపడ్డారు. గత నెల సొహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్‌పై తుది తీర్పు వెల్లడించిన సీబీఐ ప్రత్యేక కోర్టు మొత్తం 22 మంది నిందితులను నిర్దోషులుగా విడుదల చేసింది. ముందుగా ఊహించిన విధంగానే సీబీఐ సొహ్రాబుద్దీన్ కేసును దర్యాప్తు చేసిందని తీర్పు వెలువరించే సమయంలో సీబీఐ పేర్కొన్నట్టు జైట్లీ గుర్తుచేశారు.

తుపాకి లాక్కుని.. దొంగను తరిమి..

• ఢిల్లీ పెట్రోలు బంకులో యువకుడి సాహసం

న్యూఢిల్లీ, డిసెంబరు 31: ఢిల్లీలో ఒక విద్యార్థి తనను దోచుకోవాలనుకున్న వ్యక్తికే షాకిచ్చాడు. అతడి చేతుల్లోంచి తుపాకి లాక్కుని అతడికి ఎదురు తిరిగి తనను తాను కాపాడుకున్నాడు. ఈ ఘటన ఢిల్లీ షాదరా ప్రాంతంలోని పెట్రోలుబంకు వద్ద జరిగింది. తాను తన ఇన్‌స్టిట్యూట్ నుంచి ఉదయం 6గంటలకు బయల్దేరి, ఇంటికి వెళ్తూ.. బైకులో పెట్రోలు పోయించుకోడానికి బంకులో ఆగానని కరణ్ చౌదరి చెప్పాడు. బంకులో ఉండగానే ఒక వ్యక్తి తనకు తుపాకి చూపించి, బండి తాళాలు ఇవ్వాలని అడిగాడన్నాడు. అయితే అతడిని అడ్డుకోడానికి కరణ్ సాహసం చేసినట్లు సీసీటీవీ ఫుటేజిలో కనపడింది. తాను తాళాలు ఇవ్వడానికి నిరాకరించానని, బైకు నుంచి కిందికు దిగి కొద్ది దూరం పరుగెత్తి ఎవరైనా సాయం చేస్తారేమోనని అడిగానని కరణ్ అన్నాడు. కానీ అందరూ తలుపులు వేసుకుని లోపల కూర్చున్నారు తప్ప ఎవరూ సాయానికి ముందుకు రాలేదని తెలిపాడు. అయితే తాను అతడితో గొడవపడి, అతడి చేతుల్లోంచి తుపాకి లాక్కున్నానని.. దాంతో అతడు వెంటనే అక్కడినుంచి పారిపోయాడని వివరించాడు. అతడి సాహసాన్ని అందరూ అభినందించారు.

ఏపీఈడీబీకి స్కోచ్ గోల్డ్ అవార్డు

• ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో గుర్తింపు
• సీఎంకు చూపిన సీఈవో జాస్తి కృష్ణకిశోర్

అమరావతి, డిసెంబరు 31: ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి బోర్డు (ఏపీఈడీబీ)కి పెట్టుబడుల ఆకర్షణ విషయంలో ప్రతిష్ఠాత్మకమైన స్కోచ్ గోల్డ్ అవార్డు వచ్చింది. ఢిల్లీలో జరిగిన 55వ స్కోచ్ సదస్సులో ఈ అవార్డును అందించారు. 2003 నుంచి పరిపాలన, ఆర్థిక, బ్యాంకింగ్, కార్పొరేట్ పౌరసత్వం, ఆర్థిక శాస్త్రం, సమ్మిళిత వృద్ధి తదితర రంగాల్లో స్కోచ్ సంస్థ స్వతంత్రంగా ఈ అవార్డులు ఇస్తోంది. ఈసారి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఏపీఈడీబీకి ఈ అవార్డు వచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన ఏపీఈడీబీ సీఈవో జాస్తి కృష్ణకిశోర్, స్పెషల్ కమిషనర్ భావనా సక్సేనా ఈ అవార్డును సీఎంకు చూపించారు. 2016లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఏర్పడిన ఏపీఈడీబీ.. ప్రపంచవ్యాప్తంగా పలు అగ్రగామి సంస్థల ఆర్థికాభివృద్ధి సంస్థల అనుభవాలను పరిగణనలోకి తీసుకుని పనిచేస్తుంది. రాష్ట్రంలో ఆర్థికాభివృద్ధిని పెంచే బాధ్యతను ఈ బోర్డుకు అప్పగించారు. ఇందుకు పెట్టుబడులకు తగిన వాతావరణాన్ని ఏర్పాటుచేయడం, విధాన నిర్ణయాలు, ఇతర చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులకు సింగిల్‌పాయింట్ కాంటాక్టుగా ఏపీఈడీబీ ఉంటోంది. అంతర్జాతీయ వాణిజ్యం, పరిశ్రమ, దౌత్యపరమైన మిషన్లకు సంబంధించిన అన్ని చర్చలకూ ఇదే సంధానకర్తగా ఉంటోంది. రాష్ట్రంలో ఆర్థికాభివృద్ధి, ఉద్యోగ కల్పనలకు కృషి చేసినందుకు గాను ఈసారి స్కాచ్ గోల్డ్ అవార్డు లభించింది. విదేశీ ప్రభుత్వాలు, ఎంబసీలు, పలు సంస్థలు, వాణిజ్య సంఘాలన్నింటితో చర్చలు జరపడంతో పాటు.. వివిధ మంత్రిత్వశాఖలకు కావల్సిన ఫీడ్‌బ్యాక్ అందించడంలో ఏపీఈడీబీ చేసిన సేవలను జ్యూరీ ప్రస్తుతించింది. ఏపీఈడీబీ ప్రధానంగా ప్రభుత్వానికి ఆరు రకాల విధాన ప్రతిపాదనలు చేసింది. అవి.. విద్యుత్ వాహనాల విధానం, వస్త్ర విధానం, పారిశ్రామిక పార్కుల విధానం, రవాణా విధానం, గేమింగ్ మరియు యానిమేషన్ విధానం. ప్రత్యక్ష అమ్మకాలకు సంబంధించిన సూచనలు చేయడంలో ప్రభుత్వానికి సహకరించింది. ఇప్పటివరకు... ఏర్పాటైన మూడేళ్లలోనే దక్షిణ కొరియా, యూకే, జపాన్, చైనా, యూరప్, అమెరికా, సింగపూర్, మలేసియా, రష్యా లాంటి పలు దేశాలకు చెందిన సంస్థలతో భాగస్వామ్యం ఏర్పాటుచేసుకోగలిగింది.

మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..
మంగళవారం, జనవరి 1

కోటి ఆశలు... శతకోటి ఆకాంక్షలు


ఎన్నో ఆశలతో మరెన్నో ఆకాంక్షలతో సంబరంతో ఎదురుచూసిన ప్రజలకు 2017లో నిరాశే ఎదురైంది. వ్యవసాయరంగం, ఉపాధిరంగం, విద్యారంగం ... ఇలా ఒకటేమిటిఅన్ని రంగాల్లోను నిరాశ నిట్టూర్పులనే గత సంవత్సరం మిగిల్చింది. ఆర్థిక, రాజకీయ రంగాలను కూడా ఈ ఏడు కుదిపేసింది. వ్యవసాయం రంగాన్ని గురించి ఆలోచిస్తే, రైతులకు ఒరిగిందేమీ లేదు. ఎన్నో ఆశల్ని, వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన పాలకపక్షం రైతుల గురించి ఒక్క నిమిషం కూడా ఆలోచించినట్లుగా కనిపించలేదు. గతంలో ఎన్నడూ లేనట్టుగా రైతుల్ని మాత్రం గడిచిన ఏడు సంఘటిత పరిచింది. దేశవ్యాప్తంగా రైతులు సంఘటితమై ఢిల్లీ వరకు పాదయాత్రలు చేసినా మిగిలింది ప్రయాస మాత్రమే ప్రభుత్వం నుంచి కనీసం ఒక్క మాట సానుకూలంగా లభించకపోవడం రైతుల పట్ల సానుభూతి ప్రభుత్వాలకు ఏమ్రాతం సానుభూతి ఉందో స్పష్టంచేస్తోంది.

అలాగే సంవత్సరానికి కోటి ఉద్యోగాల కల్పిస్తామంటూ వాగ్దానంతో అధికారంలోకి వచ్చిన పాలకపక్షం ఈ ఐదేళ్లలో ఎన్ని ఉద్యోగాలు కల్పించిందో ప్రకటించాల్సిన సమయం ఇది. రాజకీయ రంగంలో పాలక, ప్రతిపక్షాలు రెండూ పార్లమెంట్‌ను గోదాగా భావించి సమావేశాలను కొత్తరకం రసాభాసకు కారణమవుతున్నాయి. గతంలో ప్రభుత్వ పక్షాన్ని నిలువరించేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నించేవి. నేడు ఆ వాతావరణం, పరిస్థితులు పూర్తి భిన్నంగా సాగుతున్నాయి. పాలకపక్షమే పార్లమెంట్‌ను, దాని పవిత్రతను కాలరాచే విధంగా ప్రవర్తించడం సర్వసాధారణ మైంది. ప్రజాసమస్యలు పార్లమెంట్‌లో చర్చకు రావు; ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై ఎంతమేరకు పారదర్శకత ఉందో తెలియదు. పార్లమెంట్ సమావేశాలు ఎందుకు జరుగుతున్నాయో, వాటి వల్ల ప్రజలకు ఒనగూరు ప్రయోజనమేమిటో అంతుబట్టని బ్రహ్మపదార్థంగా మారింది.

అదేమంటే... ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నావు కాబట్టి నువ్వు దేశద్రోహివి, జాతి వ్యతిరేకివి అనే ముద్ర చాలా సులభంగా ముద్రించేస్తున్నారు. తమ సమస్యలపై ఎవరితో మొరపెట్టుకోవాలో తెలియని అయోమయ స్థితిలో ప్రజలున్నారు. నిరుద్యోగుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవు. అదే గోమాంసం పేరుతో హత్యలు, దౌర్జన్యాలు మాత్రం ఆగడం లేదు. నువ్వేది తినాలో, ఏ దుస్తులు ధరించాలో అన్నీ పాలక వర్గ నేతలే నిర్ణయిస్తారు. అందుకు విరుద్ధంగా నడిస్తే జాతి వ్యతిరకివంటూ శిక్షించేందుకు సిద్ధమవుతారు. గతంలో బ్రిటిష్ వాళ్లు విభజించి పాలించు అన్న విధంగా పాలించారని చెప్పేవారు. ప్రస్తుత ప్రభుత్వ వైఖరి కూడా అదే తరహాలో ఉందని స్పష్టమవుతోంది. గత సంవత్సరమే కాదు, ఈ ఐదేళ్లలో కూడా సమాజాన్ని విభజించి పాలించడంలో బ్రిటిషర్లకు ఏమ్రాతం తీసిపోని రీతిలో ఉందని చెప్పుకోవచ్చు. సంవత్సరంలోనైనా రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళా సమస్యలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉన్నది. గతంలో ఎన్నడూ లేని విధంగా పెట్రోలియం ఉత్పత్తుల ధరలు ప్రజల్ని సతమతం చేశాయి. అలాగే, పెద్దనోట్ల రద్దు వల్ల సహజంగా సామాన్యులే ఇబ్బందులెదుర్కొన్న విషయం విదితమే. పన్ను వసూళ్లలో ఏకగవాక్ష పద్ధతి అంటూ ప్రవేశపెట్టిన జీఎస్‌టీ విధానం కూడా సామాన్యుల నడ్డి విరిచింది.

నూతన సంవత్సరంలోకి ప్రవేశించే ముందు తాము సాధించిన ప్రగతిని, ప్రజలకు చేసిన సేవలపై శ్వేతపత్రం ప్రకటిస్తే కేంద్ర ప్రభుత్వానికి సహాయపడుతుంది. లేకపోతే మళ్లీ పాకలపక్షంగా ఉండే అర్హతను కోల్పోయినట్లవుతుంది. అయినా, 'ఏ ప్రభుత్వ పాలనైనా చెప్పుకునేందుకేమున్నది? ప్రజల ఘోష పట్టించుకునే నాథుడెవరు?' అన్నట్టుగా మాటలు కోటలు దాటే నేతల్ని మనం పాలకులుగా ఎన్నుకుంటే ఇంతకు మించి ఆశించడం పేరాశే అవుతుంది. రైతుల పంటలు ఎప్పుడు దిగుబడి అవుతాయో తెలుసు... వారెంత ప్రాణాల్ని పణంగా పెట్టి వ్యవసాయం చేస్తున్నారో అందరికీ తెలుసు... ఎన్ని పోరాటాలు చేసినా, ఎన్ని గొంతులు లేచినా ప్రయోజనం శూన్యమని పాలకులు రుజువు చేస్తున్నారు. ఇందుకు ఉదాహరణగా తమిళనాడు రైతులు ప్రధాని నరేంద్ర మోదీ నివాసగృహానికి కూతవేటు దూరంలో దాదాపు50 రోజులు రకరకాలుగా నిరాహారదీక్షలు చేసినా దేశమంతా స్పందించింది కానీ, స్పందించాల్సిన ప్రధాని, ఆయన నేతృత్వంలోని ప్రభుత్వానికి పట్టించుకోకపోవడం, వారంతా తమ ప్రజలేనని గుర్తించకపోవడం ఎంత దురదృష్టకరమో ఆలోచించాల్సిన పరిస్థితి. ప్రజాసమస్యల్ని తెలుసుకునే అవసరం పాలకులకు ఉన్నట్టు లేదు. ప్రజల గోడు పట్టని ప్రభుత్వాలున్న నేపథ్యంలో ప్రజాస్వామ్యానికి ప్రమాదం వాటిల్లుతుందనడంలో సందేహం లేదు.

కొత్త సంవత్సరంలో ప్రభుత్వంపై ప్రజలు కోటి ఆశలతో, శతకోటి ఆకాంక్షలతో ఎంతో నమ్మకం పెట్టుకున్నారు. కనీసం ఈ ఎన్నికల సంవత్సరంలోనైనా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవహరిస్తే ప్రభుత్వంపై ఉన్న అవిశ్వాసం కొంతమేరకుతొలగే అవకాశం ఉంటుంది. లేదంటే ప్రస్తుత ఏడాది చివరి నెలలో జరిగిన మూడు రాష్ట్రాల అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల్లో ఎదరైన ఫలితాలే రేపు జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో కూడా ప్రతిఫలిస్తాయని గుర్తుచేసుకోవాలి. ప్రజల మౌనాన్ని అసమర్థతగానో, చేతగాని తనంగానో లేక మనమేం నిర్ణయం తీసుకున్నా భరిస్తారనో అనుకుంటే పొరపాటే అవుతుంది. కీలెరిగి వాతపెట్టినట్లు ప్రజలు ఎన్నికలు వచ్చినప్పుడు తమ అసమ్మతిని, అవిశ్వాన్ని స్పష్టంగా ప్రకటిస్తారని గతంలో ఎన్నోమార్లు రుజువైంది. నియంతగా వ్యవహరించేవారి నెవరినీ ప్రజలు సహించరని చరిత్ర ఎన్నోసార్లు ప్రత్యక్షంగా చూపించింది. ఒక్కొక్క ఎన్నికను ఒక్కొక్క గుణపాఠంగా తీసుకుంటూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకునే ప్రభుత్వాలే కలకాలం నిలుస్తాయి. లేకపోతే కాలగర్భంలో కలిసిపోతాయనడంలో సందేహ పడక్కరలేదు.



ఎన్నికల వ్యవస్థ లోపభూయిష్టం

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో స్వాతంత్ర్యం నుంచే ఎన్నికల ద్వారా ప్రజాస్వామ్య విలువలకు గట్టిగా పునాదులు వేసుకుంది. భారతదేశంలో ఎన్నికల నిర్వహణ భారత ఎన్నికల కమిషను ఆధ్వర్యంలో జరుగుతుంది. ఈ కమిషనును భారత రాజ్యాంగం ఏర్పాటు చేసింది. ఓటర్ల నమోదు కార్యక్రమం, ఓటర్ల గుర్తింపు కార్డుల విడుదల, ఎన్నికల నిర్వహణ, ఎన్నికల ఫలితాల ప్రకటన మొదలగు కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహిస్తుంది.

ఒక రాష్ట్రంలో ఎన్నికలు జరగాలంటే, దాదాపు ఎన్నికల తతంగం ఒక నెల కాలం పాటు జరుగుతుంది. అవసరమైతే ఇంకొన్నాళ్ళు ఎక్కువనూ తీసుకోవచ్చు. ఓటర్ల నమోదు కార్యక్రమం, ఓటర్ల జాబితా తయారీ, ఓటర్ల జాబితా సవరణలు, పరిశీలనలు,పరిష్కారాలు వగైరా సాధారణ కార్యక్రమాలు జరుగుతాయి. భారత రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కు అయినటువంటి ఓటు హక్కు, 18 సంవత్సరాలు నిండిన ప్రతి భారత పౌరుడు కలిగి వుంటాడు. ఓటర్ల జాబితాలో తమ పేర్లను చేర్చుట, ఓటు హక్కు పొందుట ప్రతి భారత పౌరుని హక్కు, విధి.


ఎన్నికలకు ముందు, ఎన్నికలు కమిషన్, ఎన్నికల, నామినేషన్ల, పోలింగ్, కౌంటింగ్‌ల తేదీలను ప్రకటిస్తుంది. అలాగే ఎన్నికల కోడ్‌లనూ ప్రకటిస్తుంది. జాబితాలను, గవర్నర్‌కు, రాష్ట్రపతికి అందజేయబడుతాయి. ఇంతటితో ఎన్నికల కమిషను బాధ్యత తీరుతుంది. ఆ తరువాత కార్యక్రమాన్ని, రాష్ట్రపతి కేంద్రస్థాయిలోనూ, గవర్నరు రాష్ట్ర స్థాయిలోనూ చేపడుతారు.

నిజంగా చెప్పడానికి చాలా చిన్న విషయంగా చెప్పుకున్న కొన్ని లక్షల మంది ఉద్యోగులు పగలనకా, రాత్రనకా చెమటోడ్చి కష్టపడితే ఇంత పెద్ద కార్యక్రమము విజయవంతంగా ముగుస్తుంది. ఇదంతా చూడడానికి పక్కాగా ఉన్నదనిపిస్తున్న ఎన్నికల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం వల్ల నైతేనేమి, ఎన్నికల వ్యవస్థలో ఉన్న డొల్లతనం వల్ల నైతేనేమి అక్రమార్కులకు చక్కటి అవకాశాలను అందిస్తుంది. అయితే ఎంతో కష్టపడి చక్కని ప్రణాళికలు వేసుకున్నా కొన్ని క్షేత్రస్థాయిలో సమస్యలను తెచ్చి పెడుతున్నాయి. వాటిని పరిష్కరించుకోగలిగితే భారత దేశంలో ప్రజాస్వామ్యము ఫరిడవిల్లుతుంది.

అందులో మొదటిది మనం ఎంతో కష్టపడి సంపాదించుకున్న ఓటు హక్కును మనం బూతులోకి పోయేలోగానే ఎవరో తస్కరించడం. అలాగే మన ఓటు గల్లంతై ఉండడం. ఇటీవల తెలంగాణలో జరిగిన ఎన్నికలలో పెద్ద ఎత్తున ఓట్లు తొలగించారని ఇటు ప్రతిపక్ష పార్టీ, గెలిచిన తరువాత అటు అధికార

> ఇంట్లో కూర్చొనే, చేతిలో సెల్ ఫోన్‌తో మన ఓటు మనం వెయ్యలేమా? ఖచ్చితంగా వెయ్యగలము. అప్పుడు ఓటు పర్సెంటేజ్ కూడా భారీగా పెరుగుతుంది. తన ఓటు తను వేసుకోవాలని ఉన్నా ఎన్నెన్నో కారణాల వల్ల ఆరోజు పోలింగు బూతు వరకు వెళ్ళే అవకాశం లేని వారికి, అనివార్య కారణాల వలన దూర ప్రదేశాలకు వెళ్లిన వారికి ఇలా చాలామందికి ఆన్లైన్ వోటింగ్ అనేది బహుళ ప్రయోజనము, అంతేకాక బూతుల సంఖ్య తగ్గడం వల్ల నిర్వహణ ఖర్చు కూడా భారీగా తగ్గే అవకాశం ఉంది. అదే సమయంలో ఓటింగ్ శాతం పెరిగే అవకాశం ఉంటుంది. కావున ఈ దిశలో చర్యలు చేపడితే సత్ఫలితాలు వచ్చే అవకాశం ఉంది.

పార్టీ ఇద్దరూ మాకు నష్టం అంటే మాకు నష్టం అని ఫిర్యాదు చేసుకున్నారు. ఒక పక్క పోలింగు జరుగుతుండగానే మా ఓటు గల్లంతైనది అని, నా ఓటు ఎవరో వేశారంటా అని కొందరు ప్రజలు పెద్ద ఎత్తున నిరసనలు తెలియజేసిన దృశ్యాలు టీవీలలో ప్రత్యక్ష ప్రసారం అయినాయి. ఇష్టమైన నాయకుడికి ఓటు వేసి మద్దతు తెలియజేయాలన్న ఆశతో ఎక్కడెక్కడి నుండో ప్రయాణం చేసి అలసిన శరీరాలతో ఎంతో ఓపికగా గంటలు గంటలు క్యూలో తన వంతు వచ్చే వరకు నిలబడి తీరా లిస్టులో పేరు కనబడక పోతే అతను పొందే నైరాశ్యానికి కారకులు ఎవరు, తన ప్రమేయం లేకుండా తన ఓటు ఎలా పోతుంది. దానికి కారకులెవరు. తెలుసుకోవాలన్న ప్రయత్నం మనం చేద్దామన్నా, ఎవరిని ప్రశ్నించాలో తెలియక మొత్తం ఎన్నికల వ్యవస్థను, అధికారులను ఆడిపోసుకుంటారు. ఇది ప్రధాన లోపం. అప్పటికప్పుడు అతని సమస్యని టేకప్ చేసి, ప్రత్యమ్నాయం చూపించే వ్యవస్థని ఏర్పాటు చేస్తే చాలా బాగుంటుంది. అలా చేయాలంటే, ఓటు నమోదు చేయడానికి అన్ని స్థాయిలలో ఎంత మంది అధికారులు, ఎన్ని ప్రశ్నలు వేసే వారు, ఎన్నెన్నో తనిఖీ పేపర్లు, తనిఖీలు చేసే అధికారులు ఇంత సమగ్రంగా చర్యలు తీసుకొని ప్రతి ఒక్కరికీ ఓటు ఇవ్వడానికి అధికారులు రాత్రింబవళ్ళు కష్టపడతారు. మరి తీసేటప్పుడు కనీస సమాచారం ఇవ్వక పోవడం ఇంత పెద్ద ప్రజాస్వామ్య దేశంలో శోచనీయం. తనకు తెలియకుండా,కనీసం సమాచారం ఇవ్వకుండా ఎలా తీస్తారు? అనే ప్రశ్న సామాన్యుడికు ఖచ్చితంగా ఉదయించక మానదు! అలాగే మన దేశంలో కోట్ల సంఖ్యలో బ్యాంకు ఖాతాలు ఉన్నా మన అకౌంట్లో దేనిలోనైనా ఒక్క రూపాయి తీసిన, వేసిన మనకు అలర్టు వచ్చే సదుపాయం ఉన్నప్పుడు మన ఓటు తీసేస్తే మనకు సందేశం వచ్చే ఏర్పాటు చేయలేమా? వేలి ముద్రతో లక్షలకు లక్షలు ఒక ఖాతా నుండి ఇంకొక ఖాతాకు తరలించే అవకాశం ఉన్న దేశంలో వేలి ముద్ర ద్వారా మన ఓటును వేరే వాళ్ళు వేయకుండా ఆపలేమా? ఆ వ్యవస్థను తెచ్చుకోలేమా? తెచ్చుకోగలము దానికి కావాల్సింది రాజకీయ నాయకులకు పట్టుదల, ప్రజాస్వామ్యం మీద దృఢమైన నమ్మకం, అవే ఉంటే ఈ పాటికి ఎపుడో జరిగి ఉండేది. రెండోది సాక్షాత్తు పరిపాలన పెద్ద కెసిఆర్‌కి రెండు చోట్ల ఓటుహక్కు ఉంది అని సాక్ష్యాదారాలతో సహా ప్రతిపక్ష పార్టీ అభ్యర్థి, మాజీ ఎంఎల్‌ఏ రేవంత్ రెడ్డి బహిరంగ పరచారు. డబ్బు వెదజల్లారు, ఓటర్లను మభ్య పెట్టారు, మందు పోశారు అనే ఫిర్యాదులు ఒకరి మీద ఒకరు వేసుకోవడం రాజకీయాలలో సహజం. అటువంటి వాటిని అధికారులు, నాయకులు చివరిగా ప్రజలు కూడా మామూలే అని పట్టించుకోవడం మానేశారు. కానీ ఇది అలాంటిది కాదే. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రే రెండు



వేర్వేరు చిరునామాలతో, ఓటు హక్కు కలిగి ఉండడం అనే ఫిర్యాదు ఎక్కడకు దారి తీస్తుంది. ఇటువంటి వాటిని సుమోటోగా స్వీకరించి వాస్తవాలు బయట పెట్టే అవసరం లేదా? దర్యాప్తు చేసే అధికారం నిజంగా ఎన్నికల కమిషన్‌కు లేవా? అనే సందేహాలు సహజంగా సామాన్య ప్రజలకు కలుగుతాయి. ఇదే సందర్భంలో ఒక సాధారణ పౌరుడు ఒక బ్యాంకులో వంద రూపాయలు వెయ్యాలన్నా, ఒకవెయ్యి రూపాయలు తియ్యాలన్నా, ఒక చిన్న పాపను స్కూల్లో చేర్పించాలన్నా ప్రతి చిన్న దాని నుండి, పెద్ద దాని వరకు ఆధార్ తో లింకు చెయ్యమని అసలు ఆధారు లేకపోతే నీవు దేనికి పనికిరావు అని, అసలు నీవు మనిషివే కావు అని సూచించే ప్రభుత్వం, రాజకీయ పక్షాలు ఓటర్ కార్డుకు ఎందుకని ఆధార్ లింకు చెయ్యమని కోరడం లేదు. వాటి ఆటలు సాగవనా!!. తమకు పనికిరాని ఓటర్లుంటే గుంప గుత్తగా ఓట్లు తీసేసే అధికారం ఎవరికి ఉంది. అసలు ఇటువంటి ప్రచారం నిజమా? అబద్ధమా? అనేవి ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో దర్యాప్తు చేసి రోజుల వ్యవధిలో నిజాలు బయట పెట్టి తప్పు నిజంగా జరిగిందా అయితే కారకులెవరు ? ఎలా జరిగింది? తెలుసు కొని వారికి శిక్ష విదించడం, లేకపోతె ఒకవేళ అసలు అలాంటి తప్పు నిజంగా జరగకపోతే ఎన్నికల కమిషను మీద అభాండాలు వేసిన పార్టీలకు, నాయకులకు, అట్టి ఫిర్యాదుదారులకు ఒక్కసారి సరైన శిక్ష విధిస్తే ఇటువంటి తప్పుడు వార్తలు ప్రచారం కావు. లేదంటే ఈ రాజకీయ నాయకులు చేసే తప్పుడు ప్రచారం వల్ల ఎంతో నీతిగా, నిజాయితీతో కష్టపడ్డ ఎన్నికల అధికారుల మీద సామాన్య ప్రజలకు తప్పుడు అభిప్రాయం కలిగే అవకాశం ఉంది. అది మన ప్రజాస్వామ్యానికి తీవ్ర ప్రమాదం.

అలాగే మూడవది వృద్ధులు, ముసలివారు, కంటి చూపు మందగించిన వారికి ఈవీఎం యంత్రం వాడే బాలెట్ పేపర్ నలుపు తెలుపు రంగులలో ఉంటుంది. మొన్ననే కెసిఆర్ ట్రక్ సింబల్ వల్ల మా కారు గుర్తుకు పడాల్సిన వోట్లు దానికి పడ్డాయని వాపోయారు!. అది నిజమేనని చెప్పలేము! ఏమో ట్రక్ గుర్తుకు పడవల్సినవి కారుకు పడ్డాయేమో ఎవరు చెప్పొచ్చారు!. ఏతావాత తెల్సిందేమిటంటే నలుపు తెలుపు లో ఉంటే గుర్తుల దగ్గర చాలా కన్ఫ్యూషన్ ఉంటుంది. ఒకరి ఓట్లు మరొకరికి పడే అవకాశం ఉంది. సరిగ్గా దీన్ని ఉపయోగించుకొని ప్రత్యర్థి పార్టీలు కూడా కావాలని డమ్మి అభ్యర్థులను నిలిపి వారికి కావాల్సిన వారికి, అవతలి వారి గుర్తును పోలి ఉన్న గుర్తు వచ్చేటట్లు చేయడానికి ఆస్కారం ఉంది. మొన్న జరిగిన ఎలక్షన్లలొ ఇలా కూడా జరిగింది కావున అలా కాకుండా కొంత ఖర్చు భారమైన బాలెట్ పేపర్‌లో గుర్తులు రంగుల పేపర్లో ఉంటే ఖచ్చితంగా తేడా అనేది స్పష్టంగా ఉంటుంది. గులాబి రంగు కారుకి, పచ్చ రంగు ఆటోకి , ఎర్ర రంగు ట్రక్కు కి తేడా అనేది స్పష్టంగా ఉంటుంది. అప్పుడు ఎవరికి పడాల్సిన ఓటు వారికే పడుతుంది.ఎందుకంటే ప్రజాస్వామ్యంలో ఓటు అనేది వజ్రాయుధం. ఒక్కొక్కసారి ఒక్క ఓటు అభ్యర్థుల తలరాతలను మారుస్తుంది. వారి భవిష్యత్తును నిర్దేశిస్తుంది. అందుకే ప్రతీ ఓటు కీలకం. మన తప్పిదాల వల్ల ఒకరి ఓటు ఇంకొకరికి పడడం ప్రజాస్వామ్యంలో అమానుషం.


అలాగే నాల్గవది ఈ రోజుల్లో మనం ఇంట్లో కూర్చొనే షాపింగ్ చేస్తున్నాము, చేతిలో సెల్ ఫోన్ తోనే ఒక అకౌంట్ నుండి ఇంకొక అకౌంట్‌కు క్షణాల వ్యవధిలో లక్షలకు లక్షలు మార్పిడి చేయగలుగుతున్నాము. అటువంటిది ఇంట్లో కూర్చొనే, చేతిలో సెల్ ఫోన్ తోనో మన ఓటు మనం వెయ్యలేమా? ఖచ్చితంగా వెయ్యగలము. అప్పుడు ఓటు పర్సెంటేజ్ కూడా భారీగా పెరుగుతుంది. తన ఓటు తను వేసుకోవాలని ఉన్నా ఎన్నెన్నో కారణాల వల్ల ఆరోజు పోలింగు బూతు వరకు వెళ్ళే అవకాశం లేని వారికి, అనివార్య కారణాల వలన దూర ప్రదేశాలకు వెళ్లిన వారికి ఇలా చాలా మందికి ఆన్లైన్ వోటింగ్ అనేది బహుళ ప్రయోజనము, అంతేకాక బూతుల సంఖ్య తగ్గడం వల్ల నిర్వహణ ఖర్చు కూడా భారీగా తగ్గే అవకాశం ఉంది. అదే సమయంలో ఓటింగ్ శాతం పెరిగే అవకాశం ఉంటుంది. కావున ఈ దిశలో చర్యలు చేపడితే సత్ఫలితాలు వచ్చే అవకాశం ఉంది. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం అయిన భారతదేశం దాని స్థాయిని నిలబెట్టిన వారం అవుతాము. ఈ బాధ్యత అందరి పైనా ఉంది. దీనికి కావాల్సిందల్లా దృఢమైన వజ్ర సంకల్పం, కొంచెం ఓర్పు మరికొంత నేర్పు... అవి ఎలాగూ మనలో ఎక్కువనే కాబట్టి ఆదిశలో అడుగులు వేస్తామని భావించవచ్చు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడమనందరి హక్కు- బాధ్యత.

◆ కాళంరాజు వేణుగోపాల్
8106204412

ఒక్కసారి ఎన్నికల కోడు వచ్చిందంటే ప్రజా ప్రతినిధులు నామమాత్రం అయిపోతారు. దాదాపు చాలా వ్యవస్థలు భారత ఎన్నికల కమిషను పరిధిలోకి వస్తారు. ప్రతి గ్రామంలో, పట్టణాలలోనూ పాఠశాలలు ప్రజలకు అందుబాటులో ఉండే ప్రభుత్వ భవనాలను, పాఠశాలలను, కళాశాల భవనాలను పోలింగు కేంద్రాలుగా ఉపయోగిస్తారు. పోలింగు రోజున మద్యపాన దుకాణాలను మూసివేస్తారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాలకు, పాఠశాలలకు సెలవు ప్రకటిస్తారు. ప్రజలందరూ ఎన్నికలలో పాల్గొను విధంగా ప్రజలకు పిలుపునిస్తారు.

పోలింగు కొరకు, ఎలక్ట్రానిక్ వోటింగ్ మెషిన్లు ఉపయోగిస్తారు. పోలింగు అయిన తరువాత, ఈ మెషిన్లను, అత్యంత జాగ్రత్తతో భద్రపరుస్తారు. పోలింగు రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, పోలీసువారి సహాయ సహకారాలు తీసుకుంటారు. పోలింగ్ బూత్‌లలో, పోలింగు సిబ్బందిగా ప్రభుత్వ ఉద్యోగులను, ఉపాధ్యాయులను నియమించి, వారి సేవలను పొందుతారు. పోలింగ్ రోజు 144 సెక్షను ప్రయోగించి, ప్రజలు ఎక్కువ మంది ఒకే చోట గుమిగూడకుండా చూస్తారు. ఎన్నికలు అయిన తరువాత, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లను, ప్రకటింపబడిన ఓట్ల లెక్కింపు రోజున తెరచి,ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని చేపడుతారు. దీనిని ఎన్నికలు కమిషనే నిర్వాహిస్తుంది. ఎవరెవరికి ఎన్ని ఓట్లు వచ్చాయో ప్రకటిస్తుంది. అలాగే గెలిచిన వారిని ప్రకటిస్తుంది. గెలిచిన వారి జాబితాను దేశవ్యాప్తంగా ప్రకటించి, ఆయా

మంచిమాట




ఇతరులను జయించడం కంటే! తనని తాను జయించడం చాలా కష్టం.

- గౌతమ బుద్ధుడు

'నూతన' వేడుకల్లో అతివద్దు

కొత్త సంవత్సరం వస్తుందంటే చాలు వారం ముందునుండే యువత ఎన్నో ప్రణాళికలు రూపొందించుకొని ఎంజాయి చేయాలనుకుంటారు? కానీ క్యాలెండర్లో ఒక్కదినం మారిన తర్వాత ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్న సందర్భాలను గత ఎన్నో సంవత్సరాల నుంచి చూస్తున్నాము. నేడు దిన దినం మారుతున్న సమాజంలో ప్రతిరోజు పండుగలే, బాదేసిన సంతోషమేసిన మనం పార్టీలను జరుపుకుంటాము. కానీ ఈ వేడుక వచ్చిదంటే ప్రభుత్వం



సైతం ప్రోత్సహమిస్తూ ఎన్నో అవాంతకర సంఘటలకు కారణమవుతోంది. ఎప్పుడు లేనిది ఈ రోజే మద్యం షాపులకు రాత్రి 12 గంటల వరకు అవకాశం, బార్‌లకు రాత్రి ఒంటిగంట వరకు వెసులుబాటు కల్పించడం బాధాకరం. ఇదంతా ఎందుకు? ఎందుకు జనాలను మద్యం సేవించడానికి ప్రోత్సహిస్తుందో అర్థం కానీ పరిస్థితి. అంటే ఐడియా ప్రభుత్వ ప్రధాన ఆదాయ వనరు అయినప్పటికీ ఐడియా మార్గాన్ని ఎంచుకోవాలా? దీనిపైనా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం మరిచి, వెసులుబాటు కల్పించడం వెనుక ఆంతర్యమేమిటి? నేడు రహదారుల ప్రమాదాలను అరికట్టడానికి పోలీసు యంత్రాంగాన్నీ అప్రమత్తం చేసి ప్రతి సాయంకాలం మద్యం సేవించి వాహనాల చోదకులను పరిశీలించి శిక్షిస్తున్న ప్రభుత్వం ఎందుకు ఇలా చేస్తుంది?

గతంలో నగరాలు, పట్టణాలకు పరిమితమైన ఇలాంటి వేసుకలు నేడు మారుమూల గ్రామాల సైతం వ్యాపించింది. యువత వేడుక కార్యక్రమాలలో పాల్గొని మతిస్థిమితం లేకుండా మద్యం సేవించి, కేక్‌లని, డీజే సౌండ్స్, పబ్‌లు, పార్టీలంటూ విచ్చలవిడిగా, ఏం చేస్తున్నారో తెలియకుండా చేస్తూ, మరుసటి రోజున విషాదకరమైన సంఘటనలకు పాల్పడుతూ బాధిస్తున్న కొంతమందిని ప్రతి సంవత్సరం ఇలాంటి వేడుకలలో చూస్తూనే ఉంటున్నాము. మనలో మార్పురాకపోవడం ఒక్కేత్తైతే ప్రభుత్వం సైతం సహకరించడం మరీ బాధాకరం. ఏదైనా ఎంజాయి మెంటు అనేది పరిమితులలో ఉంటే ఎలాంటి సమస్యలేదు.కానీ పరిమితి దాటితేనే కుటుంబం రోడ్డున పడేసుకునే పరిస్థితులు దాపురిస్తాయి. కావున నేటి యువత, ప్రజలు మనుసు పెట్టి ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఇలాంటి విషయాలను సంతోషకరంగా జరుపుకోవడంలో ఎలాంటి తప్పులేదు. కానీ మద్యం సేవించిన తర్వాత విచక్షణ జ్ఞానం కోల్పోయి, గతంలోని విషయాలు గుర్తుకు వచ్చి వాటి గురించి ఆలోచిస్తూ, చేయగలరని పనులుచేస్తూ, సమస్యలుకొని తెచ్చుకుంటున్నారనడంలో ఏలాంటి అవాస్తం లేదు కావున జాగ్రత్త పడాల్సిన అవసరం ఉన్నది.

వేడుకలు జరుపుకోవాలనుకుంటున్నవారికి కొన్ని సూచనలు:

మితిమీరి మద్యం సేవించి అవాంతర సంఘటనల బారిన పడకండి.

సౌండ్ సిస్టమ్‌లు పెట్టి శబ్ద కాలుష్యానికి దారితీసి, ఇతరులను ఇబ్బంది పెట్టకండి.

పాత విషయాలు గుర్తుకు తెచ్చుకోని వాటి పరిష్కార మార్గాన్నీ నేడే సూచించుకోవాలనుకోవడం ముప్పుకు దారితీస్తుంది.

ఇలాంటి సంతోషకరమైన దినాన్నీ తన కుటుంబ సభ్యులతో ఉత్సాహంగా, ఉల్లాసంగా జరుపుకోని సంతోషించండి.

చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఎలాంటి లాభం ఉండదు కావున ఆలోచించి జాగ్రత్త వహించండి.

జీవితంలో మంచిపేరు తెచ్చుకోవడానికి ఎంతోకాలం వేచి చూసి కష్టపడాలి, అదే పేరును క్షణికావేశంలో క్షణంలో పాడు చేసుకునే అవకాశం ఉంటుంది కావున జాగ్రత్త వహించండి.

సంతోషకరమైన వేడుకలు జరుపుకోవడంలో తప్పులేదు కానీ అవి ఎలాంటి వేడుకలు అయిన పర్వాలేదు కానీ అవి ఎలాంటి పరిణామాలకు దారితీయకుండా కుటుంబానికే పరిమితమవుతే చాలా బాగుంటుంది.

గత సంవత్సరంలోని విజయాలను, పరాజయాలను విశ్లేషించుకొని తగిన మార్పులు, చేర్పులు చేసుకుంటూ, నూతన సంవత్సరంలో నూతన లక్ష్యాలను ఏర్పరచుకొని, వాటి అమలుకు ప్రణాళికలు రూపొందించుకొని విజయం సాధించి, కుటుంబ సభ్యుల ను ఆనందంలో ముంచెత్తుకోవడానికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ప్రత్యేకంగా నేటి యువత ఒకటికి పలుమార్లు ఆలోచించి, గతంలోని సంఘటనలను పరిశీలించి ముందడుగు వేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. ఏది ఏమైనప్పటికి ఈ నూతన సంవత్సరంలో అందరికి శుభాలు కలగాలని కోరుకుంటూ.

మీ కోసం నా చిరు కానుక.

నూ -రు, త -రాలు, న -వ్వుతూ సిరి, సం - పదలతో
వ - ర్ధిల్లుతూ, విజయో, త్స - వాలతో వి, ర - జిల్లుతూ
శు - భాలతో ఎలాంటి, బా - ధలు లేకుండా, కాం - క్షలతో
ఏక, క్ష - లు రాకుండా జీవితా, లు -గడపాలని కోరుకుంటూ మీ.

◆ పోలం సైదులు
9441930361

నవ యుగాంశకమై.. రావాలి?

మానవీయ మర్మాన్ని చీకటి
ఛాయలు కమ్మి భవితవ్యం
భ్రష్టుడి బానిసగ బాసిల్లే
భయంకర నేపథ్యం

మోడువారిన మహాకాల
తరువుకు వసంతం మరో
కొత్త కొమ్మకు అంకురం
తొడిగింది

కుమిలి కమిలి గాలి
తుఫానుల్లో ఎన్నో గిరికీలు
కొట్టిన బతుకుటాకులు

నేల వాలి వాడి రాలి
అనుభవాలు పోసిన
ఊసులు రాసులు
రాసులుగా పోగయినవి

ఆ అవగతాల అనుభుక్తులు
అవపోసనం పట్టిన విశ్వ
గమనం కొత్త ఆశలకు
ఆయువు పోస్తూ పయనం
కొనసాగిస్తూ ఉంది

సృష్టి మనుగడలో మరో
నక్షత్రానికి చోటిచ్చి కాంతి
పుంజాల ఊడలై కోటి
ఆశలతో కొత్త వత్సరమై

కాలానికి చిగురించింది
మానవత్వ సుగంధాలు
పుడమి నిండా పరిమళించి
పరుల సుఖమే పరమావధియై
మనసులన్ని మారాలి

నవ వసంత నవ్య
కాంతుల సంతసాలు
సమాహారమై ఇలను అంతా
వెలుగులతో విరజిమ్మే
ప్రకాశితమై, నవ
యుగాంశకమై రావాలి

- కపోలు యాదయ్య
9494273703

నూతన తేజం

నిన్న నేడుతో రేపటికి రూపమిచ్చి
క్షణక్షణం నిమిష తరంగమై తరలి
గంటల మోతతో రోజులు మాసాంతముగా
వత్సరములుగా గడిచే నూతనోత్తేజము
ఆంగ్ల సంవత్సర రూపముగా నిలుచును
ప్రసరించే సూర్యకిరణాలు ఆపలేము
నడిచే సమయం భవిష్యత్తులోకి
బంగారు బాటలు చూపును
గడిచిన అనుభూతుల మధురిమలు
నడిచే రోజులలో మధురానుభూతులు
వచ్చే తరాలకు విజయ దుందుభిలు
అందుకే స్వాగతం సుస్వాగతం
నూతన ఆంగ్ల సంవత్సర ఘడియలకు

- ఉండ్రాళ్ల రాజేశం
9966946084

ఎడిట్ పేజీకి వ్యాసాలు, లేఖలు పంపేవారు పీడీఎఫ్, ఓపెన్ ఫైల్ రెండు ఫార్మాట్‌లలో హామీపత్రాన్ని జతచేస్తూ పంపవలసిందిగా సూచన.
e-mail: manamlekhalu@gmail.com







అంబరమంటిన 'కొత్త' సంబురం!

న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలో కొత్త సంవత్సర వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అంగరంగ వైభవంగా జరిగే కొత్త సంవత్సర వేడుకలను వీక్షించేందుకు ప్రపంచం నలు మూలల నుంచి పర్యాటకులు ఇక్కడికి తరలివచ్చారు. న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్‌లో బాణాసంచా కాంతులు మిరుమిట్లు గొల్పాయి. రంగు రంగుల కాంతులను వెదజల్లుతూ బాణాసంచా కాల్పులు పర్యాటకులకు కనువిందు చేశాయి. సంగీత హోరు. ఆనందోత్సాహాల నడుమ 2019 సంవత్సరానికి స్వాగతం పలికారు. పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకుని ఆనందించారు. భారీగా తరలివచ్చిన పర్యాటకులతో రెస్టారెంట్‌లు, పబ్‌లు, బార్‌లు సందడిగా మారాయి. వాతావరణం కూడా అనుకూలంగా ఉండటంతో టూరిస్టులు రెట్టించిన ఉత్సాహంతో వేడుకల్లో పాల్గొన్నారు. కొత్త సంవత్సరాల వేడుకలకు న్యూజిలాండ్ ప్రభుత్వం ఎప్పటిలానే భారీ ఏర్పాట్లు చేసింది. అత్యవసర సర్వీసులను, సహాయ సిబ్బందిని అందుబాటులో ఉంచింది. ఆస్ట్రేలియాలోని సిడ్నీ హార్బర్‌లోనూ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి.



లొంగిపోయిన సజ్జన్‌కుమార్

- ఢిల్లీలో మండోలి జైలుకు తరలింపు

న్యూఢిల్లీ, డిసెంబరు 31: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హత్యానంతరం జరిగిన సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో యావజ్జీవ ఖైదు శిక్ష పడిన కాంగ్రెస్ నాయకుడు సజ్జన్‌కుమార్.. ఢిల్లీలోని కోర్టులో సోమవారం లొంగిపోయారు. ఆయనను తూర్పు ఢిల్లీలోని మండోలి జైలుకు తీసుకొచ్చారు. రాజ్‌నగర్‌లోని ఒకే కుటుంబంలో ఐదుగురిని చంపిన కేసుతో పాటు 1984 నవంబరు 1వ తేదీన గురుద్వారాకు నిప్పు పెట్టిన ఘటనలో సజ్జన్‌ను ఢిల్లీ హైకోర్టు దోషిగా తేల్చింది. అప్పట్లో ఆయన ఆ ప్రాంత ఎంపీ కూడా. సామూహిక హత్యకాండ కేసులో సజ్జన్‌ను నిర్దోషిగా పేర్కొంటూ దిగువకోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టు తప్పుబట్టింది. కాగా, తనకు జీవితఖైదు విధిస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలుచేస్తూ సజ్జన్‌కుమార్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. శీతాకాల సెలవుల తర్వాత కోర్టు జనవరి 2 నుంచి పనిచేస్తున్నందున.. తమ కేసును త్వరగా విచారించాలని ఆయన తరపు న్యాయవాదులు కోరుతున్నారు. అయితే ఇప్పటికి ఈ ఘోరాలు జరిగి 34 ఏళ్లు అయ్యిందని, బాధజతుల కుటుంబాలు న్యాయంకోసం అలుపెరుగని పోరాటం చేస్తున్నాయని కేంద్ర మంత్రి హర్‌దీప్ సింగ్ పూరి అన్నారు. ఇతరులపై ఉన్న కేసులను కూడా త్వరగా తేల్చాలని చెప్పారు. డిసెంబరు 17న తీర్పు వచ్చిన తర్వాత.. తనకు ముగ్గురు పిల్లలు, 8 మంది మనవళ్లు, మనవరాళ్లు ఉన్నారని, ఆస్తికి సంబంధించిన విషయాలు తేల్చుకోడానికి కనీసం నెల రోజుల సమయం కావాలని సజ్జన్‌కుమార్ కోరారు. కానీ ఆయన వినతిని హైకోర్టు తోసిపుచ్చి, 31వ తేదీలోగా లొంగిపోవాలని తెలిపింది. సజ్జన్‌కు న్యాయపరంగా ఇక అవకాశాలు ఏమీ లేకపోవడం వల్లే లొంగిపోయారని, ఆయనకు సుప్రీంకోర్టులో కూడా ఊరట లభించకపోవచ్చని సిక్కు బాధితుల తరపున గత మూడు దశాబ్దాలుగా కోర్టులలో న్యాయపోరాటం చేస్తున్న సీనియర్ న్యాయవాది హెచ్ఎస్ ఫూల్కా అన్నారు.



తెల్గీ నిర్దోషి!

- తీర్పు చెప్పిన నాసిక్ కోర్టు

నాసిక్, డిసెంబరు 31: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోట్లాది రూపాయల నకిలీ స్టాంపు పేపర్ల కుంభకోణంలో ప్రధాన నిందితుడు అబ్దుల్ కరీం తెల్గీని నిర్దోషిగా నాసిక్ కోర్టు తుది తీర్పు వెల్లడించింది. గతేడాది అక్టోబరులోనే తెల్గీ మరణించాడు. 2001లో తెల్గీని అజ్మీర్‌లో అరెస్టు చేయగా ఎయిడ్స్, డయాబెటిక్, హైపర్‌టెన్షన్‌తో పాటు ఇతర జబ్బులతో 20 ఏళ్ల పాటు బాధపడ్డ తెల్గీ, బెంగళూరులోని పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తూనే మరణించాడు. అంతకు ముందు ఈ కేసును విచారించిన కోర్టు రూ.202 కోట్ల భారీ జరిమానాను విధిస్తూ తెల్గీకి 30 ఏళ్ల కఠిన జైలు శిక్ష కూడా విధించింది. కాగా అప్పట్లో కర్నాటక జైళ్ల శాఖ డీఐజీ డీ రూప నివేదిక ప్రకారం తెల్గీకి ఇక్కడి జైల్లో ప్రత్యేక సదుపాయాలను పెద్ద ఎత్తున జైలు అధికారులు కల్పించడం సంచలనం సృష్టించింది.

అండమాన్‌కు అంతర్జాతీయ విమానాలు

న్యూఢిల్లీ, డిసెంబరు 31: విదేశీ పర్యాటకులు ఇక నేరుగా అండమాన్ నికోబార్ దీవులకు వెళ్లచ్చు. పోర్ట్ బ్లెయిర్ విమానాశ్రయాన్ని అధీకృత ఇమ్మిగ్రేషన్ చెక్‌పోస్టుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దాంతో దేశంలోకి రావాలన్నా, దేశంనుంచి వెళ్లాలన్నా తగిన పత్రాలను అక్కడే తనిఖీ చేసేందుకు వీలుంటుంది. పాస్‌పోర్టు నిబంధనల ప్రకారం కేంద్ర ప్రభుత్వం పోర్ట్‌బ్లెయిర్ విమానాశ్రయాన్ని అధీకృత ఇమ్మిగ్రేషన్ చెక్‌పోస్టుగా ప్రకటిస్తోందని హోం మంత్రిత్వశాఖ నోటిఫికేషన్ ఒకటి తెలిపింది. అక్కడ ఇమ్మిగ్రేషన్ చెక్‌పోస్టుకు సివిల్ అథారిటీగా స్థానిక సీఐడీ ఎస్పీని హోం శాఖ నియమించింది. హోం మంత్రిత్వశాఖ వద్ద ఉన్న సమాచారం ప్రకారం, 2015 అక్టోబరు నుంచి ఇప్పటివరకు సుమారు 16 లక్షల మందికి పైగా విదేశీ పర్యాటకులు అండమాన్ నికోబార్ దీవులను సందర్శించారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు నివాళిగా ఇక్కడి మూడు దీవుల పేర్లను మారుస్తున్నట్లు ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించారు. రాస్ ఐలండ్‌ను నేతాజీ సుభాష్ చంద్రబోస్ ద్వీపంగాను నీల్ ఐలండ్‌ను షహీద్ ద్వీప్ అని, హేవ్‌లాక్ ఐలండ్‌ను స్వరాజ్ ద్వీప్ అని మార్చారు.

రాజ్యసభలోనే 'ట్రిపుల్ తలాక్'

- విపక్షాల ఆందోళన.. రాజ్యసభ వాయిదా
- బిల్లును సెలక్ట్ కమిటీకి పంపాల్సిందే
- కాంగ్రెస్ సహా ఇతర విపక్షాల పట్టు
- సభలో తీవ్రమైన గందరగోళం.. వాయిదా

న్యూఢిల్లీ, డిసెంబరు 31: విపక్షాల ఆందోళనల నేపథ్యంల ట్రిపుల్ తలాక్ వ్యతిరేక బిల్లుపై చర్చ జరగకుండానే రాజ్యసభ వాయిదా పడింది. ఒకేసారి ముమ్మారు తలాక్ చెప్పి విడాకులివ్వడాన్ని నేరంగా పరిగణించేందుకు ఉద్దేశించిన నూతన బిల్లు సోమవారం రాజ్యసభ



ముందుకు వచ్చింది. అయితే.. ప్రస్తుత రూపంలో ఉన్న బిల్లును అనుమతించేందుకు కాంగ్రెస్ సహా 10 విపక్షాలు నిరాకరించాయి. బిల్లును సెలక్షన్ కమిటీకి పంపించాల్సిందిగా ప్రతిపక్ష నేతలు డిమాండ్ చేశారు. బిల్లును మరింత పరిశీలించేందుకు సెలక్షన్ కమిటీకి పంపాల్సిందిగా రాజ్యసభ ప్రతిపక్ష నేత గులాం నబీ ఆజాద్ కోరారు. 'ఇది చాలా ప్రాముఖ్యమైన బిల్లు. కొన్ని కోట్ల మంది ప్రజల జీవితాలపై ఈ బిల్లు అనుకూల/ప్రతికూల ప్రభావం చూపుతోంది. అటువంటి ముఖ్యమైన బిల్లును సెలక్షన్ కమిటీ పరిశీలించకుండా ఆమోదింపజేయాలని చూడటం తగదు' అని ఆజాద్ పేర్కొన్నారు. అన్ని ప్రతిపక్ష పార్టీలు కూడా తలాక్ బిల్లును సెలక్షన్ కమిటీకి పంపించాలని ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నాయని తృణమూల్ కాంగ్రెస్ నేత డెరిక్ ఓబ్రెయిన్ తెలిపారు. రాజ్యసభలో అధికారపార్టీకి తగినంత మెజారిటీ లేకపోవడంతో ఇక్కడ ఆ బిల్లు గట్టెక్కే అవకాశాలు తక్కువే ఉన్నాయి.

రాజ్యసభ రబ్బర్ స్టాంప్ కాదు: ఆనంద్‌శర్మ

ట్రిపుల్ తలాక్ బిల్లును ఎవరూ వ్యతిరేకించడం లేదని, కానీ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపి కూలంకుశంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ నేత ఆనంద్ శర్మ పేర్కొన్నారు. బిల్లును చట్టసభ సూక్ష్మంగా పరిశీలించాల్సి ఉందని పేర్కొన్నారు. చట్టాలను చట్టసభలు సూక్ష్మంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు.



చర్చకు మేం సిద్ధమే: ప్రభుత్వం

ట్రిపుల్ తలాక్ బిల్లుపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కానీ కాంగ్రెస్ కావాలనే అడ్డంకులు సృష్టిస్తోందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి విజయ్ గోయల్ అన్నారు. లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టిన సమయంలో కాంగ్రెస్ మద్దతు తెలిపిందని, కానీ ఇప్పుడు మాత్రం మాటమార్చిందన్నారు. ముస్లిం మహిళల హక్కులకు సంబంధించిన ముఖ్యమైన బిల్లు ఆమోదం పొందకుండా కాంగ్రెస్ ఇతర పార్టీలతో కలిసి రాజకీయం చేస్తోందని మండిపడ్డారు. దీంతో పాటు కావేరి జలాలు, ఇతర అంశాల విషయంపై నేతలు ఆందోళనలకు దిగడంతో రాజ్యసభ జనవరి 2కి వాయిదా పడింది.

పాక్ దళాల ఆటకట్టు

- నియంత్రణ రేఖ వెంబడి కాల్పులు
- ఇద్దరు పాక్ ముష్కరులు హతం
- నిఘాను బలోపేతం చేసిన ఆర్మీ



శ్రీనగర్, డిసెంబరు 31: పాక్ దళాలు మరోసారి నియంత్రణ రేఖ వద్ద తెగబడే ప్రయత్నం చేశాయి. భారతీయ సైనికదళాలకు చెందిన ఒక పోస్టు వద్ద ముందుకు వచ్చేందుకు వారు చేసిన ప్రయత్నాన్ని భారత దళాలు విజయవంతంగా తిప్పికొట్టాయి. పాకిస్థానీ బోర్డర్ యాక్షన్ టీమ్ (బ్యాట్)కు చెందిన ఒక దళం నియంత్రణ రేఖను దాటేందుకు ప్రయత్నించినపుడు తాము జరిపిన కాల్పుల్లో ఇద్దరు మరణించారని సైన్యం తెలిపింది. వాళ్ల మృతదేహాలను తిరిగి తీసుకెళ్లాలని పాక్‌కు చెప్పారు. మోర్టార్లు, రాకెట్లు పేలుస్తూ దట్టమైన అడవుల్లోకి ప్రవేశించేందుకు పాక్ దళం ప్రయత్నించినా, వాళ్లను భారత సైన్యం అప్పటికే గుర్తించింది.

దాంతో రాత్రి చాలాసేపటి వరకు ఇరువైపులా తీవ్రస్థాయిలో తుపాకుల మోతలు హోరెత్తించాయి. ఉదయాన్నే ఆర్మీ దళాలు సెర్చ్ ఆపరేషన్ నిర్వహించగా.. పాకిస్థానీ సైనికులుగా అనుమానిస్తున్న ఇద్దరు వ్యక్తులు మరణించి కనిపించాయి. మిగిలినవాళ్లు నియంత్రణ రేఖ నుంచి పాకిస్థానీ కాల్పుల నేపథ్యంలో చీకట్లో వెనక్కి పారిపోయి ఉంటారని అనుకుంటున్నారు. దానికి తోడు వాతావరణం కూడా అనుకూలించకపోవడంతో వాళ్లు భారత భూభాగంలోకి రాలేకపోయారు. భారీ మొత్తంలో ఆయుధాలను కూడా వాళ్లు తెచ్చేందుకు ప్రయత్నించారు. దాంతో సుదీర్ఘకాలం పాటు సాగే ఎన్‌కౌంటర్‌కు వాళ్లు సిద్ధపడే వచ్చినట్లు తెలిసింది.

నౌగామ్ సెక్టార్‌లో భారత ఫార్వర్డ్ పోస్ట్‌పై పెద్దస్థాయి దాడి చేయాలన్నది కూడా వారి కుట్రగా తెలుస్తోంది. ఆ ప్రాంతాన్ని శానిటైజ్ చేసేందుకు సెక్టార్ మొత్తం సెర్చ్ ఆపరేషన్లు కొనసాగుతున్నట్లు ఆర్మీ అధికార ప్రతినిధి తెలిపారు. చొరబాటుదారులు కూడా పాకిస్థానీ సైనిక బలగాల్లాగే యుద్ధ యూనిఫాంలు ధరించి ఉన్నారు. వాళ్లు పాకిస్థాన్‌లో తయారైన ఆయుధాలు ధరించి వచ్చారు. ఇంతకుముందు భారత ఆర్మీ యూనిఫాం తరహా దుస్తులు కూడా ధరించి.. మోసగించాలని చూశారు. దుండగుల వద్ద ఐఈడీలు, ఇతర పేలుడు పదార్థాలు కూడా ఉన్నాయి. నియంత్రణ రేఖ వెంబడి నిఘాను బలోపేతం చేయాలని ఆర్మీ నిర్ణయించడం వల్ల పాకిస్థాన్ పన్నుతున్న కుట్రలన్నింటినీ భగ్నం చేయగలుగుతున్నామని ఆర్మీ ఓ ప్రకటనలో తెలిపింది.



రక్షణ ఒప్పందాల్లో వారి జోక్యం లేదు

- సోనియా, రాహుల్ కలగజేసుకోలేదు: ఏకే ఆంటోనీ

న్యూఢిల్లీ, డిసెంబరు 31: దేశ రక్షణ ఒప్పందాల విషయంలో సోనియా గాంధీ గానీ, రాహుల్ గాంధీ గానీ ఎప్పుడూ జోక్యం చేసుకోలేదని రక్షణ శాఖ మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఏకే ఆంటోనీ అన్నారు. ఈ విషయంలో బీజేపీ అవాస్తవాలు 'ఉత్పత్తి' చేస్తోందని ఆయన విమర్శించారు. ప్రభుత్వం, బీజేపీ కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేస్తూ అవాస్తవాలను ఉత్పత్తి చేస్తున్నాయని ఆయన మీడియాతో వ్యాఖ్యానించారు. అగస్టా వెస్ట్‌లాండ్ స్కాం కేసులో క్రిస్టియన్ మైఖేల్ వాంగ్మూలం తర్వాత బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పరస్పరం బురద చల్లుకుంటున్న నేపథ్యంలో ఆంటోనీ ఈ వ్యాఖ్యలు చేశారు.

విదేశాలకు తీసుకెళ్తే 'అమ్మ' బతికేది

- తమిళనాడు మంత్రి సీవీ షణ్ముగం వ్యాఖ్య

చెన్నై, డిసెంబరు 31: విదేశాలకు తీసుకెళ్తే జయలలిత బతికేదని ఆ రాష్ట్ర మంత్రి సీవీ షణ్ముగం పేర్కొన్నారు. జయలలిత ఆస్పత్రిలో ఉండగా ఆమె ఆరోగ్యంపై వైద్యారోగ్య కార్యదర్శి జే. రాధాకృష్ణన్, మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామ మోహనరావులు విచారణ కమిషన్‌ను అవాస్తవ సమాచారం అందించారని, కమిషన్‌ను తప్పుదారి పట్టించారని షణ్ముగం ఆరోపించారు. జయలలిత ఆస్పత్రిలో ఉండగా వీరి పాత్రపై సందేహం వ్యక్తం చేస్తూ ఈ అంశంపై విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చికిత్స నిమిత్తం జయలలితను విదేశాలకు తీసుకువెళ్లే ప్రతిపాదనను వైద్యారోగ్య కార్యదర్శి రాధాకృష్ణన్ వ్యతిరేకించారని, అలా చేస్తే భారత వైద్యుల ప్రతిష్ట దెబ్బతింటుందని ఆయన భావించారని చెప్పారు. ఆయన స్వయంగా డాక్టర్ అయి ఉండీ రోగి పరిస్థితిని అంచనా వేయడంలో విఫలమయ్యారని విమర్శించారు.

బీజేపీ నేత బంధువు హత్య

- బిహార్‌లో కాల్చిచంపిన మావోయిస్టులు

పట్నా, డిసెంబరు 31: బిహార్‌లోని ఔరంగాబాద్‌లో బీజేపీ నాయకుడి సమీప బంధువును మావోయిస్టులు కాల్చిచంపారు. పలు వాహనాలకు నిప్పు పెట్టారు. అనంతరం నగరంలో పలు కరపత్రాలు విడిచిపెట్టారు. రెండేళ్ల క్రితం పెద్దనోట్లు రద్దుచేసినపుడు పాత నోట్లకు బదులు కొత్త నోట్లు ఇస్తామని ఆ నాయకుడు, అతడి బంధువు కలిసి రూ. 7 కోట్లు తీసుకుని తిరిగి తమకివ్వలేదని ఆ కరపత్రాల్లో ఆరోపించారు. బిహార్ శాసనమండలిలో బీజేపీ సభ్యుడైన రాజన్‌కుమార్ సింగ్ ఇంటిపై దాదాపు 200 మంది దాడిచేశారు. ఒక ఇంటికి, పది వాహనాలకు నిప్పుపెట్టారు. ఆయన సమీప బంధువు నరేంద్రసింగ్ (55)ను కాల్చిచంపారు. మావోయిస్టుల దాడి గురించి తెలుసుకున్న భద్రతాదళాలు అక్కడకు వెళ్లి వారితో తలపడ్డాయి. దాంతో మావోయిస్టులు అక్కడినుంచి పారిపోయినట్లు పోలీసు అధికారి సత్యప్రకాష్ తెలిపారు.

కేసులు ఎత్తేస్తారా.. మద్దతు ఉపసంహరించాలా?

ఎంపీ, రాజస్థాన్ ప్రభుత్వాలకు మాయావతి అల్టిమేటం

లఖ్‌నవ్, డిసెంబరు 31: మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలోని కాంగ్రెస్ ప్రభుత్వాలకు బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్‌పీ) హెచ్చరికలు జారీ చేసింది. ఎస్సీ, ఎస్టీ చట్టంపై సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ ఈ ఏడాది ఏప్రిల్ 2న నిర్వహించిన భారత్ బంద్ సందర్భంగా తమ కార్యకర్తలపై పెట్టిన కేసులను ఉపసంహరించాలని బీఎస్‌పీ డిమాండ్ చేస్తోంది. తమ డిమాండ్‌ను సానుకూలంగా పరిష్కరించడంలో విఫలమైతే బయటి నుంచి ఇస్తున్న మద్దతును ఉపసంహరించుకుంటామని కాంగ్రెస్‌ను హెచ్చరించింది. మధ్య ప్రదేశ్, రాజస్థాన్ శాసన సభలకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. రాజస్థాన్‌లో 99 స్థానాలు, మధ్య ప్రదేశ్‌లో 119 స్థానాలు దక్కించుకుని ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది. బీఎస్‌పీకి రాజస్థాన్‌లో ఆరుగురు, మధ్య ప్రదేశ్‌లో ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నారు. అయితే బీఎస్‌పీ హెచ్చరికల వల్ల కాంగ్రెస్ ప్రభుత్వాలకు తక్షణం ఎదురయ్యే ఇబ్బందులేవీ ఉండవు, కానీ లోక్‌సభ ఎన్నికలపై ఆ ప్రభావం పడే అవకాశం ఉంటుంది.



ఘనంగా రాజమౌళి కుమారుడి వివాహం

ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి తనయుడు ఎస్.ఎస్.కార్తికేయ వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. రాజస్థాన్ రాజధాని జైపూర్‌లోని ఓ ప్యాలెస్‌లో కార్తికేయ, పూజా ప్రసాద్ వివాహ బంధంతో ఆదివారం ఒక్కటయ్యారు. ఈ వేడుకకు తెలుగు సినీ పరిశ్రమ నుండి అగ్ర తారాతోరణం నాగార్జున, ప్రభాస్, ఎన్టీఆర్, రామ్‌చరణ్, అఖిల్, రానా, అనుష్క తదితరులు పాల్గొన్నారు. హీరో ప్రభాస్ పెళ్లి కుమార్తె పల్లకిని మోశారు.









● మహేష్

తెలుగు సినిమా బావుండాలి

- వెంకటేష్

వెంకటేష్, వరుణ్‌తేజ్, తమన్నా, మెహరీన్ ప్రధాన తారాగణంగా రూపొందిన చిత్రం 'ఎఫ్2'. అనిల్ రావిపూడి దర్శకుడు. ఈ సినిమా ఆడియో విడుదల కార్యక్రమం వైజాగ్‌లో జరిగింది. ఆంధ్ర ప్రదేశ్ మంత్రి గంటా శ్రీనివాసరావు ఆడియో సీడీలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ ''నాకు వైజాగ్‌తో చాలా మంచి అనుబంధం ఉంది. తొలి చిత్రం కలియుగ పాండవులు ఇక్కడే చేశాను. తర్వాత సుందరకాండ, స్వర్ణకమలం, మల్లీశ్వరి ..ఇలా చాలా సినిమాలు చేశాను. వరుణ్‌లో ఓ సోదరుడిని చూసుకున్నాను. సినిమా చాలా ఫన్‌తో ఉంటుంది. ఈ సంక్రాంతికి అల్లుళ్లుగా వస్తున్నాం. మా సినిమాతో పాటు విడుదలవుతున్న రజనీకాంత్‌గారు, బాలయ్యగారు, చరణ్ సినిమాలకు ఆల్ ది బెస్ట్. అన్నీ సినిమాలు హిట్ కావాలి. తెలుగు సినిమా బావుండాలి'' అన్నారు. వరుణ్‌తేజ్ మాట్లాడుతూ ''గంటా శ్రీనివాసరావు మాకు ఆప్తులు. వైజాగ్‌లో సత్యానంద్‌గారి దగ్గరే యాక్టింగ్ నేర్చుకున్నాను. వెంకటేశ్‌గారితో కలిసి నటించడం గౌరవంగా భావిస్తున్నాను. ఓ ఫ్రెండ్‌లా, గైడ్‌లా నాకు సలహాలిచ్చారు'' అన్నారు. దిల్‌రాజు మాట్లాడుతూ ''సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు తర్వాత వెంకటేశ్‌తో.. ఫిదా తర్వాత వరుణ్‌తేజ్‌తో చేస్తున్న సినిమా ఇది. సినిమాకు ఫ్యామిలీ అంతా నవ్వుకునేలా ఉండే సినిమా'' అన్నారు. గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ ''వైజాగ్‌లో ఇండస్ట్రీ రావాల్సిన అవసరం ఉంది. ఇక్కడ అన్నీ వసతులున్నాయి. భవిష్యత్‌లో షూటింగ్ చేసే సినిమాల్లో కొంత భాగాన్ని వైజాగ్‌లో చిత్రీకరించేలా ప్లాన్ చేసుకోవాలి'' అన్నారు.

'మహర్షి' మరో లుక్

మహేష్ హీరోగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'మహర్షి'. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, వైజయంతి మూవీస్, పి.వి.పి సినిమా పతాకాలపై రూపొందుతోన్న ఈ చిత్రం మహేష్‌కు ఇది 25వ చిత్రం కావడం విశేషం. ఈ చిత్రాన్ని చాలా ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో షెడ్యూల్ పూర్తయింది. జనవరి రెండో వారం నుంచి మార్చి వరకు జరిగే షెడ్యూల్‌తో టోటల్‌గా షూటింగ్ పూర్తవుతుంది. సమ్మర్ స్పెషల్‌గా ఏప్రిల్‌లో చిత్రాన్ని రిలీజ్ చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. పూజా హెగ్డే కథానాయికగా నటిస్తోంది. అల్లరి నరేష్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు.



● అల్లుఅర్జున్

న్యాయ నిర్ణేతగా...



● ఎ.ఆర్.రెహమాన్

ఆస్కార్ విన్నర్ ఎ.ఆర్.రెహమాన్ గురించి ప్రత్యేకంగా కొత్తగా చెప్పనక్కర్లేదు. ఆయన సంగీత దర్శకుడిగానే కాదు.. ఓ ఆల్బమ్‌కు నిర్మాతగా, ఓ వీడియో సాంగ్‌ను డైరెక్ట్ చేశారు. ఇలా సందర్భాన్ని బట్టి సంగీత సామ్రాజ్యంలో తన ఆసక్తి పరిధిని పెంచుకుంటూనే వస్తున్నారు. ఈ ఆస్కార్ విన్నర్ ఓ ఇండియన్ ఛానెల్ వారు నిర్వహించనున్న ది వాయిస్ అనే ప్రోగ్రామ్‌కు జడ్జ్‌గా వ్యవహరించబోతున్నారు. కొత్త సింగర్స్‌ను పరిచయం చేయబోయే ఈ కార్యక్రమాన్ని డడ్లాని, కనికాకపూర్ ఆధ్వర్యంలో ఈ ప్రోగ్రామ్ డిజైన్ చేయబడుతుంది. ఎ.ఆర్.రెహమాన్ జడ్జ్‌గా మారుతున్నారంటే.. ఇలాంటి ప్రోగ్రాంకు క్రేజ్ మరో రేంజ్‌లో ఉంటుందనేది ప్రత్యేకంగాచెప్పనక్కర్లేదు.



'యన్.టి.ఆర్' చిత్రంలో విద్యాబాలన్

బన్ని, త్రివిక్రమ్ మూవీ కన్‌ఫర్మ్

అల్లు అర్జున్ తదుపరి సినిమా ఏ దర్శకుడితో చేయబోతున్నాడనే దానిపై ఓ క్లారిటీ వచ్చింది. త్రివిక్రమ్ దర్శకత్వంలో బన్ని సినిమాను అధికారికంగా ప్రకటించారు. బన్ని, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న 3వ చిత్రమిది. నిర్మాణ సంస్థలు 'హారిక అండ్ హాసిని క్రియేషన్స్, 'గీతాఆర్ట్స్' అధినేతలు అల్లు అరవింద్, ఎస్.రాధాకృష్ణ(చినబాబు)లు సంయుక్తంగా ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే చిత్రం పూర్వ నిర్మాణ కార్యక్రమాలు పూర్తయ్యాయి. చిత్రానికి సంబంధించిన ఇతర తారాగణం, సాంకేతిక నిపుణులు వివరాలు త్వరలో ప్రకటిస్తారు.









'జెర్సీ' చిత్రంలో నాని

విశాల్ నిశ్చితార్థం

నటుడు, నడిగర్ సంఘం ప్రధాన కార్యదర్శి, నిర్మాతల సంఘం అధ్యక్షుడు విశాల్ త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నట్లు తెలుస్తుంది. ఈ విషయాన్ని ఓ ప్రముఖ తమిళ దిన పత్రికకు ఆయన తండ్రి జి.కె.రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన అనీషా అనే అమ్మాయితో హైదరాబాద్‌లో నిశ్చితార్థం జరగనుందనేది సమాచారం. అయితే ఎప్పుడు, ఏంటనే విషయాలు మాత్రం చెప్పలేదు. హీరోయిన్ వరలక్ష్మి శరత్‌కుమార్‌ను విశాల్ పెళ్లి చేసుకుంటాడని వినిపిస్తున్న వార్తలకు దీంతో దాదాపు బ్రేక్ పడ్డటయ్యింది. నడిగర్ సంఘం భవనం పూర్తయిన తర్వాతే తన పెళ్లి అని ప్రకటించిన విశాల్.. దాదాపు ఈ ఏడాది పెళ్లి చేసుకోవడం ఖాయంగానే కనిపిస్తుంది.



కుర్రాళ్ల '4 లెటర్స్'



● ఈశ్వర్, టువ చక్రవర్తి

ఈశ్వర్, టువ చక్రవర్తి, అంకిత మహారాణా హీరో హీరోయిన్లుగా పరిచయం అవుతున్న చిత్రం '4 లెటర్స్' ఆర్.రఘురాజ్ దర్శకుడు. దొమ్మరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్‌కుమార్ నిర్మాతలు. సినిమా ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలను జరుపుకుంటోంది. ఈ సందర్భంగా... నిర్మాతలు మాట్లాడుతూ ''మా బ్యానర్‌లో నిర్మిస్తోన్న తొలి చిత్రం '4 లెటర్స్'. ఈ చిత్రం ద్వారా ఈశ్వర్‌ను హీరోగా పరిచయం చేయడం ఆనందంగా ఉంది. చాలా చక్కగా నటించాడు. 'కలుసుకోవాలని' వంటి బ్యూటీఫుల్, క్యూట్ లవ్ స్టోరీని తెరకెక్కించి అందరి మన్ననలు పొందిన దర్శకుడు రఘురాజ్‌గారు మా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. యూత్ సహా అన్నీ వర్గాలను ఆకట్టుకునే ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రూపొందించాం. చిత్రీకరణంతా పూర్తి చేశాం''అన్నారు. దర్శకుడు ఆర్.రఘురాజ్ మాట్లాడుతూ ''కలుసుకోవాలని' తర్వాత కన్నడ, తమిళ సినిమాలతో బిజీగా మారిపోయాను. చాలా గ్యాప్ తర్వాత తెలుగులో నేను డైరెక్ట్ చేసిన మూవీ. నేటి ట్రెండ్‌కు తగ్గట్లు సినిమాను తెరకెక్కించాను. హీరో హీరోయిన్స్ చక్కగా నటించారు. హైదరాబాద్‌లో టాకీ పార్ట్‌ను, బ్యాంకాక్‌లో సాంగ్స్‌ను చిత్రీకరించాం. నిర్మాతలు మేకింగ్‌లో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సపోర్ట్ చేయడంతో సినిమాను అనుకున్న ప్రణాళిక ప్రకారం పూర్తి చేశాం'' అన్నారు.

ఏడాది చివరి ట్రేడింగ్‌లో ఫ్లాట్‌గా మార్కెట్లు

- 8 పాయింట్ల నష్టంతో 36,068 వద్ద ముగిసిన సెన్సెక్స్
- నిఫ్టీ మూడు పాయింట్ల లాభాలతో 10,862 ముగింపు
- సెషన్ మొత్తం ఒడిదుడుకులు
- కన్స్యూమర్ డ్యూరబుల్, ఫార్మా రంగాల్లో కొనసాగిన కొనుగోలుల మద్దతు
- ఒక దశలో భారీ లాభల దిశగా ట్రేడింగ్..రియాల్టి రంగం ఫ్లాట్‌గా ముగింపుత

మార్కెట్ 2018 సంవత్సరానికి ఫ్లాట్ ముగింపుతో వీడ్కోలు పలికింది. ఈ ఏడాదిలో మార్కెట్లకు చివరిరోజైన నేటి ట్రేడింగ్ సెషన్‌లో సూచీలు ఆద్యంతం ఒడిదుడుకుల ట్రేడింగ్‌ను సాగించిన సూచీలు చివరకు ఫ్లాట్‌గా ముగిశాయి. ప్రపంచమార్కెట్లలో సానుకూల వాతావరణం నెలకొనడంతో ఉదయం భారీ లాభంతో మార్కెట్ ప్రారంభమైనప్పటికీ.., ఆసియా, ఐరోపా మార్కెట్ల మిశ్రమ ముగింపు, ముడిచమురు ధరల పెరుగుదల మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి.మిశ్రమంగా ముగిశాయి. ప్రధాన సూచీలైన సెన్సెక్స్ 8పాయింట్లు నష్టపోయి 36,068 వద్ద, నిఫ్టీ 3పాయింట్ల స్వల్ప లాభంతో 10,862 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 200 పాయింట్లను లాభాలను కోల్పోగా, నిఫ్టీ ఇండెక్స్ 10,900 మార్కును నిలబెట్టుకోలేకపోయింది. ఇంట్రాడేలో అత్యధికంగా మెటల్ ఇండెక్స్, కన్జ్యూమర్ డ్యూరబుల్, ఫార్మా రంగాల్లో కొనుగోళ్లు జరిగాయి. టెలికాం, ఎనర్జీ, ఎఫ్ఎంజీసీ, రియల్టీ రంగ షేర్ల షేర్లలో అమ్మకాలు జరిగాయి. ప్రధాన సూచీలు నష్టాల్లో ముగిసినప్పటికీ.., మిడ్‌క్యాప్ ఇండెక్స్, స్మాల్ ఇండెక్స్‌లు షేర్లు జోరుగా ర్యాలీ చేశాయి. ఈ ఏడాదిలో సెన్సెక్స్ సూచీ 2220 పాయింట్లను, నిఫ్టీ సూచీ 331 పాయింట్లను ఆర్జించింది.



సెన్సెక్స్ 200 పాయింట్ల లాభం ఆవిరి

ప్రపంచమార్కెట్లలలో నెలకొన్న సానుకూల ట్రెండ్‌కు, రూపాయి విలువ బలపడటంతో సోమవారం స్టాక్ మార్కెట్ లాభాలతో ట్రేడింగ్‌ను ప్రారంభించింది. సెన్సెక్స్ 163 పాయింట్ల లాభంతోనూ, నిఫ్టీ సూచీ 10,900లపైన ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. సూచీలకు ఇది వరుసగా నాలుగోరోజూ లాభాల ప్రారంభం కావడం విశేషం. ఆటోమొబైల్స్, లోహ, ఫార్మా తదితర రంగాల్లో కొనుగోళ్ల అండతో సూచీలు ట్రేడింగ్ ప్రారంభమైన కొద్ది క్షణాల్లోనే సెన్సెక్స్ సూచీ 208 పాయింట్లు ఆర్జించి 36,285 వద్ద, 63 పాయింట్లు పెరిగి 10,923 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. నమోదు చేశాయి. ఇంట్రాడేలో ఇన్వెస్టర్లు



ముడిచమురు ధరలు పెరగడటం, డాలర్ మారకంలో రూపాయి బలహీనపడటం, నేడు నవంబర్ నెల మౌలిక వసతుల రంగం వ ద్ధి వివరాలు వెల్లడికానున్న నేపథ్యంలో ఇన్వెస్టర్ల అప్రమత్తత తదితర అంశాలను సూచీల ర్యాలీకి అవరోధంగా నిలిచాయి. ముఖ్యంగా ఇంధన, టెలికాం, ఎఫ్ఎంసీజీ రంగాలకు చెందిన రంగాల్లోత అమ్మకాలు జరగడంతో మిడ్‌సెషన్ సమయానికి సూచీలు ఆరంభలాభాల్ని కొల్పోయిన నష్టాల్లో ట్రేడయ్యాయి. ఒకానొక దశలో సెన్సెక్స్ సూచీ 43 పాయింట్ల మేర నష్టపోయి 36,034 వద్ద, నిఫ్టీ సూచీ 10 పాయింట్ల క్షీణించి 10,853 వద్ద ఇంట్రాడే కనిష్టాలను నమోదు చేశాయి. అయితే మిడ్‌సెషన్ అనంతరం యూరప్ మార్కెట్ల లాభాల ప్రారంభం, మిడ్, స్మాల్ క్యాప్ షేర్ల జోరుతో సూచీలు మళ్లీ లాభాల్లోకి మళ్లాయి. అయితే మన మార్కెట్ ముగింపు సమయానికి యూరప్ మార్కెట్లు నష్టాల్లోకి మళ్లడటంతో పాటు, మార్కెట్‌ను ప్రభావితం చేసే అంశాలేమిలేకపోవడంతో సూచీ స్తబ్దుగా ట్రేడై చివరికి ఫ్లాట్‌గా ముగిశాయి. సెన్సెక్స్ సూచీ 36వేల స్థాయిని నిలుపుకోగా, నిఫ్టీ ఇండెక్స్ 10900 పాయింట్లను నిలుపోలేకపోవడం గమనార్హం.

హీరోమోటోకార్ప్, యాక్సిస్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, భారతీ ఇన్ఫ్రాటెల్ షేర్లు 1నుంచి 3శాతం నష్టపోగా, సన్‌ఫార్మా, టాటామోటర్స్, వేదాంత, టాటాస్టీల్, జేఎస్‌డబ్లూ?య స్టీల్ షేర్లు 1.50శాతం నుంచి 3శాతం లాభపడ్డాయి.



మళ్లీ హీరోనే టాప్

న్యూఢిల్లీ: దేశీయ ద్విచక్రవాహన రంగంలో హీరో మోటోకార్ప్ తన స్థానాన్ని నిలబెట్టుకుంది. నవంబరు నెలలో జరిగిన అమ్మకాల్లో హీరో సంస్థకు చెందిన నాలుగు బైక్‌లు టాప్-10లో చోటు దక్కించుకున్నాయి. హీరోతో పాటు హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా(హెచ్ఎంఎస్ఐ), బజాజ్ ఆటో, టీవీఎస్ మోటార్ కంపెనీలు కూడా అమ్మకాల్లో వృద్ధిని కనబరిచాయి. సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటో మొబైల్ మ్యానుఫాక్చర్స్(ఎస్ఐఏఎం) గణాంకాల ప్రకారం హీరో మోటోకార్ప్‌కు చెందిన స్ప్లెండర్ అత్యధికంగా అమ్ముడుపోయింది. అయితే, గతేడాది నవంబరు నెల(2,25,737) అమ్మకాలతో పోలిస్తే కాస్త తగ్గి 2,25,536 వాహనాలు విక్రయమయ్యాయి. ఆ తర్వాత 2,18,212 యూని ట్లతో రెడా యాక్టివా రెండో స్థానంలో నిలిచింది. గతేడాది ఇదే సమయంలో 2,26,046 యూనిట్లు అమ్ముడుపోవడం గమనార్హం. 1,68,839 యూ నిట్లతో హీరోకు చెందిన హెచ్ ఎఫ్ డీలక్స్ మూడో స్థానంలో నిలిచింది. నాలుగో స్థానంలో టీవీఎస్ మోటార్స్‌కు చెందిన ఎక్స్ఎల్ సూపర్ మోపెడ్ ఉంది. 2017లో 69,888 యూనిట్లు అమ్ముడుపోయిన ఎక్స్ఎల్ ఈసారి వృద్ధిని నమోదు చేసి ఏకంగా 74,590 వాహనాలను విక్రయించింది. హీరో మోటోకార్ప్‌కు చెందిన ప్యాషన్ బైక్ 74,396 యూనిట్లతో ఐదో స్థానంలో నిలవగా, ఆ తర్వాత రెడా సీబీ షైన్(70,803) బజాజ్ పల్సర్(69,579) టీవీఎస్ జుపిటర్(69,391), హీరో గ్లామర్ (63,416), బజాజ్ ప్లాటినా (62,555)లు టాప్-10లో ఉన్నాయి.



బలంగా రూపాయి

న్యూఢిల్లీ: వివిధ కరెన్సీలతో డాలరు బలహీనపడిన నేపథ్యంలో సోమవారం భారత్ రూపాయి సైతం ఇతర ఆసియా కరెన్సీలబాటలోనే బలపడింది. ముంబైలోని ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్సే?ఛంజ్ మార్కెట్లో డాలరుతో పోలిస్తే మారకపు విలువ 13 పైసలు పెరిగి 69.81 స్థాయికి చేరింది. అయితే 2018లో ఆసియా కరెన్సీల్లోకెల్లా అత్యధికంగా నష్టపోయింది రూపాయే. ఈ ఏడాది ఇది 9 శాతం పతనమయ్యింది. 2011లో 15.8 శాతం నష్టపోయిన తర్వాత రూపాయి అధ్వాన్న పనితీరు కనపర్చడం ఈ ఏడాదే. విదేశీ ఇన్వెస్టర్ల ఈ ఏడాది భారత్ కేపిటల్ మార్కెట్ నుంచి 11 బిలియన్ డాలర్ల నిధుల్ని ఉపసంహరించుకున్నారు. ఫలితంగా రూపాయి భారీ నష్టాన్ని చవిచూసింది.

బులియన్‌లో మార్కెట్లో స్వల్ప నష్టాలు



న్యూఢిల్లీ: అమెరికా చైనాల మధ్య వాణిజ్య యుద్ధ చర్చలు సఫలం కావచ్చనే అంచనాల నేపథ్యంలో సోమవారం పసిడి ధర స్వల్పంగా నష్టపోయింది. ఆసియా ట్రేడింగ్లో ఉదయం సెషన్లో 3.50డాలర్లకు పైగా నష్టపోయింది. డాలర్ ఇండెక్స్ వారం రోజుల కనిష్టం నుంచి కోలుకోవడం కూడా పసిడి ట్రేడింగ్ పై ప్రతికూల ప్రభావాన్ని చూపింది. చైనా అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశాలున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ట్వీట్లో పేర్కొనడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లకు కలిసొస్తుందనే అంచనాలు పసిడిని నష్టాల వైపుకు మళ్లించాయి. మధ్యాహ్నం 12:15ని.లకు ఔన్స్ పసిడి ధర 2డాలర్లు నష్టపోయి 1,281 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. ప్రపంచ ఆర్థిక మందగమన ఆందోళనలు, అమెరికా మార్కెట్ల ఒడిదుడుకుల ట్రేడింగ్, డాలర్ ఇండెక్స్ వారం రోజుల కనిష్టానికి పతనం తదితర కారణాలతో గత శుక్రవారం రాత్రి అమెరికా మార్కెట్లో పసిడి ధర 6నెలల తర్వాత మొదటిసారి 1280డాలర్లపై ముగిసింది. అంతర్జాతీయ ట్రెండ్‌కు అనుగుణంగా దేశీయంగానూ పసిడి ధర స్వల్పంగా నష్టాల్లో ట్రేడ్ అవుతుంది. డాలర్ మారకంలో రూపాయి బలపడటం దేశీయ బులియన్ మార్కెట్లో పసిడి ధర నష్టాల బాట పట్టించింది. మధ్యాహ్నం 12:15ని.లకు 10గ్రాముల పసిడి ధర రూ.39లు నష్టపోయి రూ.31559.00ల వద్ద ట్రేడ్ అవుతోంది. గత శుక్రవారం రాత్రి పసిడి ధర రూ.115లు నష్టపోయి రూ.31598.00 వద్ద ముగిసింది.

బేసిక్ వెర్షన్ ఫోన్లకు వాట్సప్ గుడ్‌బై



కొన్ని నిర్ధారిత ప్లాట్‌ఫామ్స్‌కు రేపటి నుంచి సేవలు నిలిపివేస్తున్నట్టు వాట్సప్ ప్రకటించింది. 'నోకియా ఎస్ 40'లో డిసెంబర్ 31 తర్వాత వాట్సప్ పనిచేయదు. ఆండ్రాయిడ్ ఓఎస్ వెర్షన్ 2.3.7తో పాటు దాని కంటే పాత ఓఎస్‌లో కూడా వాట్సప్ రాదు. భవిష్యత్తులో తాము ప్రవేశపెట్టబోయే ఫీచర్లను పాత ఐఓఎస్ సపోర్ట్ చేయబోదని ఇంతకు వాట్సప్ తన బ్లాగ్‌లో పేర్కొంది. తమ సేవలు కొనసాగాలంటే ఓఎస్ 4.0 ప్లస్, ఐఓఎస్ 7 ప్లస్ లేదా విండోస్ ఫోన్ 8.1 ప్లస్‌కు అప్‌డేట్ చేసుకోవాలని సూచించింది.ఆండ్రాయిడ్ వెర్షన్ 2.3.3 కంటే పాత ఓఎస్‌లో వాట్సప్ పనిచేయదు. విండోస్ ఫోన్ 7, ఐఫోన్ 3జీఎస్/ఐఓఎస్ 6, నోకియా సింబియన్ ఎస్ 60 వెర్షన్లలో కూడా వాట్సప్ రాదు. ఐఓఎస్ 7, పాత వెర్షన్లల్లోనూ 2020, ఫిబ్రవరి 1 నుంచి వాట్సప్ సేవలు నిలిచిపోనున్నాయి. ఐఫోన్ 4, ఐఫోన్ 4ఎస్, ఐఫోన్ 5, ఐఫోన్ 5సీ, ఐఫోన్ 5ఎస్.. ఐఓఎస్ 7 ఆధారంగా నడుస్తున్నాయి. ఆండ్రాయిడ్ రన్నింగ్ ఓఎస్ 4.0 ప్లస్, ఐఫోన్ రన్నింగ్ ఐఓఎస్ 8 ప్లస్, విండోస్ ఫోన్ 8.1 ప్లస్, జియో ఫోన్, జియో ఫోన్ 2లకు వాట్సప్ సేవలు కొనసాగుతాయి. అయితే ఈ ఫోన్లలో చాట్ హిస్టరీని ట్రాన్స్‌ఫర్ చేసుకునే అవకాశం లేదని వాట్సప్ వెల్లడించింది. చాట్ హిస్టరీని ఈ-మెయిల్‌కు పంపుకోవచ్చని సూచించింది.


ఎస్‌బీఐతో జెట్ చర్చలు



న్యూఢిల్లీ: ఆర్థిక కష్టాల్లో చిక్కుకున్న విమాన సంస్థ జెట్ ఎయిర్‌వేస్.. రూ.1,500 కోట్ల రుణం కోసం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)తో సంప్రదింపులు జరుపుతోందని విశ్వసనీయవర్గాలు తెలిపాయి. నిర్వహణ మూలధనంతోపాటు బకాయిల చెల్లింపుల అవసరాల కోసం సంస్థ ఈ రుణాన్ని సేకరించాలనుకుంటున్నట్లు వారు చెప్పారు. జెట్ ఎయిర్‌వేసలో 24 శాతం వాటా కలిగిన గల్ఫ్ ఎయిర్‌లైన్ 'ఎతిహాద్'.. ఈ రుణానికి గ్యారెంటీ ఇవ్వనున్నట్లు సమాచారం. సంస్థ పద్దులపై అంతర్జాతీయ సంస్థ ఈవై ఫోరెన్సిక్ జరుపుతోంది. ఈ తరుణం జెట్ భారీ రుణం కోసం ఎస్‌బీఐతో సంప్రదింపులు జరుపుతుండటం గమనార్హం. నరేశ్ గోయల్‌కు చెందిన ఈ విమాన సంస్థ ఆర్థిక ఇబ్బందుల కారణంగా గత కొన్ని నెలల నుంచి పైలెట్లు, ఇతర సిబ్బందికి సకాలంలో జీతాలు కూడా చెల్లించలేకపోతోంది. వరుసగా మూడు త్రైమాసికాల నుంచి రూ.1,000 కోట్లకు పైగా నష్టాలను ప్రకటించింది. ఈ సెప్టెంబర్ 30 నాటికి కంపెనీపై రూ.8,052 కోట్ల రుణభారం ఉంది.



పెరిగిన వసూళ్లు



ముంబై: మొండి బకాయిలపై రిజర్వు బ్యాంక్ సంధించిన దివాలాచట్టం అస్త్రం దెబ్బకు రుణాలు తీసుకున్నవారు దిగిరాక తప్పడం లేదు. ఐబీసీ, సర్ఫేసి చట్టం ప్రకారం రుణాల చెల్లింపుదారులపై బ్యాంకులు కఠిన చర్యలు తీసుకోవడంతో గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఏకంగా రూ.40,400 కోట్ల రుణాలు తిరిగి వసూలయ్యాయి. 2017-18 ఆర్థిక సంవత్సరానికిగాను రిజర్వు బ్యాంక్ తాజాగా విడుదల చేసిన వార్షిక నివేదికలో వెల్లడించింది. అంతక్రితం ఏడాదిలో రూ.38,500 కోట్లుగా ఉన్నాయి. మొండి బకాయిలను తిరిగి వసూలు చేయడానికి దివాలా చట్టం, సర్ఫేస్ యాక్ట్, డెబిట్ రికవరీ ట్రిబ్యునల్, లోక్ అదాలత్ వంటి మార్గాల ద్వారా వసూలు చేసే అవకాశం బ్యాంకులకు ఉన్నది. వసూలు చేసిన వాటిలో దివాలా చట్టం కింద రూ.4,900 కోట్లు, సర్ఫేస్ చట్టం ప్రకారం రూ.26,500 కోట్లు వసూలు చేసినట్లు ఈ వార్షిక నివేదికలో తెలిపింది. బ్యాంకులు తీవ్రమైన ప్రయత్నాలు చేయడం వల్లనే మొండి బకాయిల వసూళ్లు పెరిగాయని, దీనికి తోడు సర్ఫేస్ యాక్ట్ ప్రకారం ఆస్తులు వివరాలు, నెల రోజుల్లో ప్రాసెసెషన్ చెయ్యనివారికి మూడు నెలల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉండటంతో భారీ స్థాయిలో రుణాలు తిరిగి రాబట్టగలిగాయి .ఇదే సమయంలో లోక్ అదాలత్, డీఆర్‌టీఎస్‌ల కింద కేసులు తగ్గుముఖం పట్టగా, ఒత్తిడిలో ఉన్న ఆస్తులపై దివాలా చట్టప్రకారం చర్యలు తీసుకోవడం ఇందుకు పరోక్షంగా దోహదం చేస్తున్నాయి. దివాలా చట్టం ప్రాసెస్‌కోసం చర్యలను వేగవంతం చేయడం, ఎన్‌సీఎల్‌టీఎస్ కింద మరిన్ని బెంచ్‌లను ఏర్పాటు చేయడంతో ప్రస్తుతం ఐబీసీ కింద కేసుల పరిష్కారం వేగవంతం అయిందని నివేదికలో ఆర్బీఐ అభిప్రాయపడింది. బ్యాలెన్స్ షీట్స్‌ను నిరంతరాయంగా పర్యవేక్షించడంతోపాటు వీటిని పునర్వ్యవస్థీకరించుకోవాలని, అలాగే, బ్యాంకులు/ఎన్‌బీఎఫ్‌సీఎస్/ఆర్థిక సేవల సంస్థలు కూడా తమవంతుగా కోతలు విధించుకోవాలని నివేదిక సూచించింది. తాకట్టుకింద పెట్టిన ఆస్తుల విక్రయంలో ప్రభుత్వరంగ బ్యాంకుల కంటే ప్రైవేట్ బ్యాంకులు చర్యల్లో వేగం పెంచాయని, వివిధ మార్గాల్లో తమ అప్పులను తగ్గించుకోవడానికి ప్రయత్నాలను వేగవంతం చేశాయని తెలిపింది.



డోలట్ ఇన్వెస్ట్‌మెంట్ ర్యాలీ 769%

ముంబై: 2018 ప్రారంభంలో రూ.7.25లకు కొనుగోలు చేసిన స్టాక్ డిసెంబర్ చివరకు నుంచి రూ.65లకు పెరిగింది. అంటే ఒక్క స్టాక్ కొంటే రూ. 58 లాభం. అదే 100 స్టాక్స్ కొంటే రూ. 5,800 రాబడి పొందొచ్చు. స్టాక్ మార్కెట్‌కు 2018 అంతగా కలిసిరాలేదని చెప్పొచ్చు. 85 శాతానికిపైగా స్టాక్స్ బెంచ్‌మార్క్ ఇండెక్స్ సెన్సెక్స్ కన్నా మెరుగైన పనితీరు కనబర్చలేకపోయాయి. స్మాల్‌క్యాప్స్ అయితే బాగా నష్టపోయాయి. గీతాంజలి జెమ్స్, క్వాలిటీ వంటి బాగా తెలిసిన మిడ్‌క్యాప్ స్టాక్స్ పెన్నీ స్టాక్స్‌గా మారితే.. అతితక్కువగా తెలిసిన దాదాపు 20 స్టాక్స్ ఇన్వెస్టర్లకు అదిరిపోయే రాబడులను అందించాయి.

స్టాక్ బ్రోకింగ్ సంస్థ డోలట్ ఇన్వెస్ట్‌మెంట్ ఏడాది కాలంలో ఏకంగా 769 శాతం ర్యాలీ చేసింది. అంటే 2018 ప్రారంభంలో రూ.7.25లకు కొంటే డిసెంబర్ చివరకు నుంచి రూ.65లకు పెరిగింది. అంటే ఒక్క స్టాక్ కొంటే రూ. 58 లాభం. అదే 100 స్టాక్స్ కొంటే రూ.5,800 రాబడి పొందొచ్చు. ఓరియెంట్ ట్రేడ్ లింక్, వికాస్ ప్రొప్పంట్ అండ్ గ్రాఫైట్, థింక్ ఇంక్ స్టూడియో, గుజరాత్ పాలీ ఎలక్ట్రానిక్స్, ఆర్ఎంజీ అలాయ్ స్టీల్, ఎస్‌పీఎస్ ఇంటర్నేషనల్, క్రౌన్ టూర్స్ వంటి స్టాక్స్ 140 నుంచి 650 శాతం శ్రేణిలో రాబడి అందించాయి. అలాగే సైబెల్ ఇండస్ట్రీస్, ఇంద్రయాని బయోటెక్, ఎక్సెల్ ఇండియా, బయో గ్రీన్ పేపర్స్, జైన్ స్టూడియోస్, వెల్కాన్ ఇంటర్నేషనల్, ఆర్నాల్డ్ హోల్డింగ్స్ వంటి స్టాక్స్ 50 నుంచి 130 శాతం మధ్యలో పెరిగాయి.

రూ. 10లోపు ట్రేడయ్యే స్టాక్స్‌ను పెన్నీ స్టాక్స్‌గా పేర్కొంటాం.



వీటిల్లో రిస్క్ ఎక్కువగా ఉంటుంది. రిస్క్ తీసుకోవడానికి ఇష్టపడని ఇన్వెస్టర్లు వీటికి దూరంగా ఉండటం ఉత్తమం. ఈ స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేయాలనుకునే వారు కంపెనీ ప్రమోటర్ గురించి, హోల్డింగ్స్, కంపెనీ ఫైనాన్షియల్స్, రుణ భారం, షేరు తనఖా వంటి విషయాలను తెలుసుకోవాలి. మార్కెట్ రెగ్యులేటర్ వివిధ కారణాల వల్ల ఈ స్టాక్స్‌పై పలు సందర్భాల్లో నియంత్రణలు విధిస్తూ ఉంటాయి. షేర్లలో ఇన్వెస్ట్ చేసేటప్పుడు సమర్థవంతమైన మేనేజ్‌మెంట్, వ్యాపార నాణ్యత వంటి అంశాలను గమనించాలని ప్రముఖ ఇన్వెస్టర్ విజయ్ కేడియా తెలిపారు. మన్‌పసంద్, పీసీ జువెలర్స్ వంటి కంపెనీలు పేరున్నవేనని, అయితే ఇప్పుడు వీటి పనితీరు బాగోలేదని పేర్కొన్నారు. అందుకే సమర్థవంతమైన మేనేజ్‌మెంట్ అవసరమని తెలిపారు

పీవీ సింధుకు రాహుల్ గాంధీ ప్రశంసలు

హైదరాబాద్: ఇటీవల బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ టైటిల్‌ను గెలుచుకున్న హైదరాబాద్ స్టార్ షట్లర్ పీవీ సింధును జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రశంసించారు. ఆయన ప్రశంస పత్రాన్ని ఏఐసీసీ సభ్యుడు, టీపీసీసీ రీసెర్చ్ సెక్రెటరీ ఆమిర్ జావెద్ సోమవారం



సింధుకు అందజేశారు. 'దేశ వ్యాప్తంగా ఔత్సాహిక క్రీడాకారులకు సింధు విజయం ఓ ఆశాకిరణం' అని రాహుల్ తన ప్రశంసా పత్రంలో పేర్కొన్నారు. ఆమె విజయం మరింత మంది యువ మహిళలు క్రీడలను కెరీర్‌గా ఎంచుకునేందకు ఉపయోగ పడుతుందని కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఆశా భావం వ్యక్తం చేశారు. అంతేకాదు రాబోయే టోర్నీలతో పాటు 2020 టోక్యో ఒలింపిక్స్‌లోనూ ఆమె విజయం సాధించాలని తనతో పాటు యావత్ భారత్ కోరుకుంటోందని రాహుల్ చెప్పారు. టీపీసీసీ అధ్యక్షుడు, హుజూర్‌నగర్ ఎమ్మెల్యే ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా సింధుకు ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్ టోర్నీల్లోనూ గెలు పొందాలని ఆకాంక్షించారు. వరల్డ్ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్స్‌లో 3వ ర్యాంక్‌లో కొన సాగుతోంది సింధు ప్రస్తుతం ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్‌లో ఆడుతోంది.

వన్డే ప్లేయర్ ఆఫ్ ది ఉమెన్‌గా స్మృతి మంధాన

దుబాయ్: మైదానంలో ఈ ఏడాది వన్డే, టీ20ల్లో పరుగుల వరద పారించిన భారత మహిళల జట్టు ఓపెనర్ స్మృతి మంధాన ఐసీసీ నుంచి అరుదైన ఘనతల్ని సొంతం చేసుకుంది. ఐసీసీ తాజాగా నిర్వహించిన ఓటింగ్‌లో స్మృతి మంధాన... 'ఐసీసీ ఉమెన్స్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్'తో పాటు 'ఐసీసీ ఉమెన్స్ వన్డే క్రికెటర్ ఆఫ్ ద



ఇయర్'గానూ నిలిచింది. వెస్టిండీస్ వేదికగా ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్‌లో భారత్ జట్టు సెమీస్ చేరడంలో క్రియాశీలక పాత్ర పోషించిన మంధాన.. 2018లో 12 వన్డేలాడి 66.90 సగటుతో ఏకంగా 669 పరుగులు చేసింది. అలానే.. 25 టీ20లు ఆడిన మంధాన 622 పరుగులు చేసింది. దీంతో.. ఐసీసీ వన్డే, టీ20 ర్యాంకింగ్స్‌లోనూ ఈ ఎడమచేతి వాటం ఓపెనర్ టాప్-10లో కొనసాగుతోంది. ఐసీసీ నుంచి రెండు అవార్డులు లభించడంపై మంధాన మాట్లాడుతూ 'ఈ అవార్డులు నాకు చాలా ప్రత్యేకం. మైదానంలో జట్టు గెలిచేందుకు పరుగులు సాధించాలని కోరుకుంటాం. అలానే.. ఇలాంటి అవార్డులు క్రికెటర్లు మరింత నిబద్ధతతో ఆడేలా స్ఫూర్తినిస్తాయి' అని మంధాన సంతోషం వ్యక్తం చేసింది.

గెలిచారు ఇలా

ఎంసీజీ టెస్టుపై ఓ రిపోర్టు



పెర్త్‌లో జరిగిన రెండో టెస్టులో ఘోర పరాజయం పాలైన టీమిండియా మెల్‌బోర్న్‌లో జరిగిన మూడో టెస్టులో ఘన విజయం సాధించింది. ఉద్రేకానికి లోనైన కోహ్లీ సేన మూడో టెస్టులో ఆస్ట్రేలియాను 137 పరుగుల తేడాతో ఓడించింది. నాలుగు మ్యాచ్‌ల ఈ టెస్టు సిరీస్‌లో 2-1 ఆధిక్యంతో నిలిచింది. భారత యువ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా ఆస్ట్రేలియా ఆశలపై నీళ్లు చల్లాడు. ఈ మ్యాచ్‌లో బుమ్రా 9 వికెట్లు తీసుకున్నాడు. చటేశ్వర్ పుజారా మరోసారి ఆస్ట్రేలియా బౌలర్లను ధీటుగా ఎదుర్కొన్నాడు. అంతేకాదు కెప్టెన్ విరాట్ కోహ్లీ కూడా తన గోల్డెన్ రన్‌ను కొనసాగించాడు. అరంగేట్ర క్రికెటర్ మయాంక్ అగర్వాల్ కూడా సత్తా చాటాడు. దీంతో మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో (ఎంసీజీ) టీమిండియాకు తిరుగులేకుండా పోయింది. ఎంసీజీ టెస్టులో భారత క్రికెటర్ల ప్రతిభను ఓసారి చూద్దాం..

(మనం క్రీడా విభాగం)

జస్‌ప్రీత్ బుమ్రా (10/10): తన బౌలింగ్‌లో ఆడటం అంత సులువు కాదని కంగారూలకు బుమ్రా తెలియజేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా 7 వికెట్ల నష్టానికి 443 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. తర్వాత బుమ్రా అద్భుతమైన బౌలింగ్ కారణంగా ఆసీస్ 151 పరుగులకే ఆలౌటైంది. దీంతో భారత్‌కు 292 పరుగుల ఆధిక్యం లభించింది. తొలి ఇన్నింగ్స్‌లో బుమ్రా సాధించిన రికార్డు బౌలింగ్ ఫిగర్స్ 6/33.. ఎంసీజీలో మునుపు భారత బౌలర్లెవ్వరూ సాధించలేదు. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో నలుగురు టాప్ బ్యాట్స్‌మెన్‌ను పెవిలియన్ పంపాడు. తర్వాత టెయిలెండర్లలో ఇద్దరిని అవుట్ చేశాడు. అయితే స్లో బాల్‌లో షాన్ మార్ష్‌ను బుమ్రా ఎల్‌బిడబ్ల్యూ అవుట్ చేయడం హైలైట్‌గా నిలిచింది. ఇక రెండో ఇన్నింగ్స్‌లో మూడు వికెట్లు తీయడంతో టీమిండియా మరపురాని విజయాన్ని సొంతం చేసుకుంది.



చెటేశ్వర్ పుజారా (9/10): బుమ్రా వార్తల్లో ప్రధాన శీర్షికల్లో నిలిచిండొచ్చు. కానీ బ్యాట్‌తో చటేశ్వర్ పుజారా అందించిన సహకారాన్ని మరువలేం. తొలి ఇన్నింగ్స్‌లో పుజారా ఆస్ట్రేలియా బౌలర్లను ధీటుగా ఎదుర్కొని సెంచరీ సాధించాడు. అంతేకాదు మయాంక్ అగర్వాల్, విరాట్ కోహ్లీలతో కలిసి విలువైన భాగస్వామ్యాలు అందించాడు. రాను రాను బ్యాటింగ్ చేయడం కష్టసాధ్యమయ్యే పిచ్‌పై తొలి ఇన్నింగ్స్‌లో పుజారా సెంచరీ చేయడం వల్లే టీమిండియా ఆరోగ్యకరమైన స్కోరును చేయగలిగింది.



విరాట్ కోహ్లీ (8/10): కోహ్లీ గోల్డెన్ రన్ కొనసాగింది. ఎంతో సహనంతో 204 బంతులు ఆడి 82 పరుగులు చేశాడు. తొలి రోజు ఆస్ట్రేలియా బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్ చేయడంతో వికెట్ ఇవ్వకుండా పోరాడాడు. తర్వాత జట్టుకు మంచి స్కోరు అందించాలన్న ఉద్దేశంతో కాస్త దూకుడుగా ఆడిన కోహ్లీ సెంచరీ చేయకుండానే వెనుదిరిగాడు. అతని కెప్టెన్సీ ప్రతిభ అద్భుతం. పేస్ బౌలర్లలలో ఎవరిని ఎప్పుడు బౌలింగ్‌కు దించాలన్న కోహ్లీ ఎత్తుగడలు ప్రశంసనీయం. ప్రత్యర్థి పసిగట్టలేని కోహ్లీ వ్యూహాల కారణంగా టీమిండియా మరో గెలుపును సొంతం చేసుకుంది.

మయాంక్ అగర్వాల్ (8/10): ఓపెనర్లు కేఎల్ రాహుల్, మురళీ విజయ్‌లను పక్కన పెట్టడంతో ఎంసీజీ టెస్టులో అరంగేట్రం చేసే అవకాశం మయాంక్ అగర్వాల్‌కు దక్కింది. పెర్త్‌లో విజయం తర్వాత ఆస్ట్రేలియా బౌలర్లు రెట్టించిన ఆత్మవిశ్వాసంతో ఉన్నారు. కానీ అగర్వాల్ ఆసీస్ బౌలర్లను లెక్కచేయకుండా 76 పరుగులతో మెరుపు మెరిపించాడు. రంజీ ట్రోఫీలో భారీగా పరుగులు చేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో మయాంక్‌ను టెస్టు జట్టుకు ఎంపిక చేశారు. దేశవాళీ క్రికెట్ అనుభవాన్ని ఈ కర్ణాటక బ్యాట్స్‌మన్ ప్రదర్శించాడు. ఇక రెండో ఇన్నింగ్స్‌లో టాప్, మిడిలార్డర్‌ను కమ్మిన్స్ కుప్పకూల్చడంతో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్న మయాంక్ జట్టును కాపాడే క్రమంలో 42 పరుగులు చేశాడు.



రోహిత్ శర్మ (7/10): టెస్టు జట్టులో స్థానం ఇచ్చినందుకు రోహిత్ శర్మ తగిన న్యాయం చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో అజేయ 63 పరుగులు చేశాడు. పెర్త్ ఓటమి తర్వాత బ్యాటింగ్‌ను మరింత బలోపేతం చేయాలని టీమిండియా ఆలోచన చేసింది. అయితే అడిలైడ్‌లో పేలవమైన షాట్‌కు అవుటైన రోహిత్ ఈ మ్యాచ్‌లో బ్యాటింగ్ బాధ్యతను తన భుజాలపై వేసుకున్నాడు. టాప్, మిడిలార్డర్ గట్టి పునాది వేయడంతో లోయర్ ఆర్డర్‌కు రోహిత్ అండగా నిలిచాడు. దీంతో టీమిండియా 400కుపైగా స్కోరు చేసింది.

హనుమ విహారి (4/10): ఇన్నింగ్స్‌ను ప్రారంభించే చక్కని అవకాశాన్ని హనుమ విహారి సద్వినియోగం చేసుకోలేకపోయిండొచ్చు. తక్కువ పరుగులే (8, 13) చేసివుండొచ్చు. కానీ ఎక్కువ సేపు క్రీజులో ఉండాలన్న అతని దృఢ సంకల్పానికి కెప్టెన్ విరాట్ కోహ్లీ ముగ్ధుడయ్యాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 111 బాల్స్ ఆడాడు. అంతేకాదు స్పిన్ బౌలింగ్‌లో కెప్టెన్‌కు ఆప్షన్‌గా నిలిచాడు. సిడ్నీ టెస్టులోనూ ఇదే విన్నింగ్ జట్టు బరిలోకి దిగే విహారి, అగర్వాల్‌లు ఓపెనర్లుగా బరిలోకి దిగే అవకాశముంది.

అజింక్య రహానే (5/10): ఇన్నింగ్స్‌ను బాగానే ప్రారంభించిన రహానే దాన్ని భారీ స్కోరుగా మలచడంలో విఫలమయ్యాడు. తొలి ఇన్నింగ్స్‌లో 34 పరుగులు చేసిన రహానే రెండో ఇన్నింగ్స్‌లో 1 పరుగు చేసి వెనుదిరిగాడు.

రిషబ్ పంత్ (7/10): స్టంప్స్ వెనకాల నిరంతరం ఏదో ఒకటి వాగుతూనే ఉండటంతో పాటు రిషబ్ పంత్ ఎంసీజీ టెస్టులో సత్తా కూడా చాటాడు. తొలి ఇన్నింగ్స్‌లో 39, రెండో ఇన్నింగ్స్‌లో 33 పరుగులు చేశాడు. 3 క్యాచ్‌లు పట్టాడు. క్యాచ్‌ను చేజార్చడంతో పాటు కొన్ని తప్పులు చేసిన పంత్ జట్టులో సుస్థిర స్థానం సంపాదించిన క్రికెటర్లలో ఒకడు.



రవీంద్ర జడేజా (7/10): తన పాత్రను పర్ఫెక్ట్‌గా నిర్వర్తించిన క్రికెటర్ జడేజా. తొలి ఇన్నింగ్స్‌లో ఒక ఎండ్ నుంచి కట్టుదిట్టమైన బౌలింగ్ చేసిన జడేజా 25 ఓవర్లలో 45 పరుగులిచ్చి 2 వికెట్లు తీశాడు. మరో ఎండ్‌లో ఫాస్ట్ బౌలర్లపై ఆసీస్ బ్యాట్స్‌మెన్ ఎదురుదాడికి దిగారు. ఇక రెండో ఇన్నింగ్స్‌లో బ్యాట్స్‌మెన్ ఫుట్‌మార్క్స్‌ను చక్కగా వినియోగించుకుని కీలకమైన ఆటగాళ్లను అవుట్ చేశాడు. 82 పరుగులిచ్చి 3 వికెట్లు తీశాడు. అయితే సిడ్నీ టెస్టుకు రవిచంద్రన్ అశ్విన్ పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తే జడేజా జట్టులో ఉంటాడా? అనేది ఆసక్తికరంగా మారింది.

మహ్మద్ షమీ (7/10): రెండో ఇన్నింగ్స్‌లో షమీ చాలా ప్రమాదకరమైన బౌలర్‌గా మారాడని రికార్డులు చెబుతున్నాయి. ఎంసీజీలో రెండు కీలకమైన వికెట్లు తీశాడు. తొలి ఇన్నింగ్స్‌లో బుమ్రా ఒంటి చేత్తో ఆస్ట్రేలియా బ్యాటింగ్ లేనప్‌ను కుప్పకూల్చడంతో షమీకి పెద్దగా పనిలేకుండా పోయింది. కానీ రెండో ఇన్నింగ్స్‌లో షమీ 3 వికెట్లు తీశాడు.

ఇషాంత్ శర్మ (7/10): సీనియర్ బౌలర్ ఇషాంత్ శర్మ అనుభవం జట్టుకు బాగా ఉపయోగపడింది. ఆరంభంలోనే ఆరోన్ ఫించ్ వికెట్ తీయడంతో తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా శుభారంభం చేసినట్టయింది. ఇక రెండో ఇన్నింగ్స్‌లో అదే రకమైన బౌలింగ్ చేసి రెండు వికెట్లు కూడా తీసుకున్నాడు.

హర్మన్‌కు అరుదైన గౌరవం

- ఐసీసీ టీ20 కెప్టెన్‌గా కౌర్ ఎంపిక

దుబాయ్: భారత మహిళా క్రికెటర్ హర్మన్‌ప్రీత్ కౌర్ అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసీసీ) టీ20 కెప్టెన్‌గా ఎంపికైంది. ఈ ఏడాదికిగాను అత్యుత్తమ మహిళా క్రికెట్ జట్లను ఐసీసీ ఎంపిక చేయగా, అందులో టీ20 విభాగంలో హర్మన్‌ప్రీత్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు. ఈ మేరకు సోమవారం అత్యుత్తమ మహిళా వన్డే, టీ20 జట్లను ఐసీసీ ప్రకటించింది. టీ20 ఫార్మాట్‌లో భారత్ నుంచి హర్మన్‌తో పాటు స్మృతీ మంధాన, పూనమ్ యాదవ్‌లకు చోటు దక్కింది. ఇక వన్డే విభాగంలో భారత్ నుంచి స్మృతీ మంధాన, పూనమ్ యాదవ్‌లకు మాత్రమే స్థానం దక్కగా, కెప్టెన్‌గా న్యూజిలాండ్ మహిళా క్రికెటర్ సుజీ బేట్స్ ఎంపికైంది. 2018గాను క్రీడాకారిణుల ప్రదర్శనలో భాగంగా మీడియా-బ్రాడ్‌కాస్టర్స్ సభ్యులతో కూడిన బృందం విడివిడిగా రెండు అత్యుత్తమ జట్లను ఓటింగ్ ద్వారా ఎన్నుకుంది. నవంబర్‌లో జరిగిన ఐసీసీ మహిళల వరల్డ్ టీ20లో భారత జట్టు సెమీ ఫైనల్స్‌కు చేరడంలో హర్మన్‌ప్రీత్ కీలక పాత్ర పోషించింది. ఆ టోర్నమెంట్‌లో కౌర్ 160.5 సగటుతో 183 పరుగులు చేసింది. 2018లో హర్మన్‌ప్రీత్ 25 టీ20 మ్యాచ్‌లు ఆడి 663 పరుగులు సాధించింది. మరొకవైపు ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో కౌర్ మూడో స్థానంలో కొనసాగుతుంది.

ఐసీసీ మహిళా టీ20 జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్, భారత్), స్మృతీ మంధాన (భారత్), అలైస్సా హేలీ (ఆస్ట్రేలియా, వికెట్ కీపర్), సుజీ బేట్స్ (న్యూజిలాండ్), నాటేటీ స్కీవర్ (ఇంగ్లాండ్), ఎలైసె పెర్రీ (ఆస్ట్రేలియా), అష్లే గార్డనర్ (ఆస్ట్రేలియా), కాస్పెర్క్ (న్యూజిలాండ్),



మెగాన్ స్కట్ (ఆస్ట్రేలియా), రుమానా అహ్మద్ (బంగ్లాదేశ్), పూనమ్ యాదవ్ (భారత్)

ఐసీసీ వన్డే జట్టు: సుజీ బేట్స్ (కెప్టెన్, న్యూజిలాండ్), స్మృతీ మంధాన (భారత్), టామీ బీమౌంట్ (ఇంగ్లాండ్), డేన్‌వాన్ నీకెర్క్ (దక్షిణాఫ్రికా), సోఫీ డివైన్ (న్యూజిలాండ్), అలైస్సా హేలీ (వికెట్ కీపర్, ఆస్ట్రేలియా), మారింజన్నే కాప్ (దక్షిణాఫ్రికా), డాటిన్ (వెస్టిండీస్), సానా మిర్ (పాకిస్థాన్), సోఫీ ఎక్లేస్టోన్(ఇంగ్లాండ్), పూనమ్ యాదవ్ (భారత్).

సిడ్నీలో కోహ్లీ, అనుష్క న్యూఇయర్ సంబరాలు

మూడో టెస్టులో ఆస్ట్రేలియాపై ఆదివారం టీమిండియా 137 పరుగుల ఘన విజయం సాధించిన నేపథ్యంలో టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ భార్య అనుష్క శర్మతో కలిసి నూతన సంవత్సర వేడుకలకు కొంత సమయాన్ని కేటాయించాడు. 'సిడ్నీకి బయల్దేరాం. నా ప్రియమైన భార్య



అనుష్క శర్మతో కలిసి న్యూఇయర్ వేడుకలను చేసుకోవాలని అనుకుంటున్నాను' అని కోహ్లీ ట్వీట్ చేశాడు. సోమవారం టీమిండియా సిడ్నీకి వెళ్లింది. నెట్ ప్రాక్టీస్, మీడియా సమావేశాలను రద్దు చేసింది. అంతేకాదు జనవరి 1వ తేదీని శిక్షణ కానీ మీడియా సమావేశాలు కానీ ఉండవని బీసీసీఐ ధ్రువీకరించింది. దీంతో బుధవారం సిడ్నీలో జరిగే నాల్గవ, చివరి టెస్టులో భారత క్రికెటర్లు నేరుగా బరిలోకి దిగనున్నారు.

టాప్ ర్యాంక్‌లో కోహ్లీ, రబాడ

- ఐసీసీ టెస్టు ప్లేయర్ ర్యాంకింగ్స్

దుబాయ్: టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీకి 2018 ఘనమైనదిగా నిలిచింది. ఏడాది చివర్లో విడుదలైన ఐసీసీ టెస్టు ప్లేయర్ ర్యాంకింగ్స్‌లో కోహ్లీతో పాటు సౌతాఫ్రికా ఫాస్ట్ బౌలర్ కగిసో రబాడ అగ్రస్థానంలో నిలిచారు. ఆస్ట్రేలియాతో మెల్‌బోర్న్‌లో జరిగిన మూడో టెస్టులో కోహ్లీ 82 పరుగులకు అవుట్ కావడంతో మూడో పాయింట్లు కొల్పోయినప్పటికీ న్యూజిలాండ్‌కు చెందిన కేన్ విలియమ్సన్‌కు 34 పరుగుల ఆధిక్యంలో కోహ్లీ ఉన్నాడు. విలియమ్సన్ రెండో స్థానంలో నిలిచాడు. ఈ సంవత్సరంలో కెరీర్





అత్యధిక 937 పాయింట్లను సాధించిన కోహ్లీ 2018లో మొత్తంగా 1322 పరుగులు చేశాడు. మెల్‌బోర్న్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ చేసిన చటేశ్వర్ పుజారా నాలుగో స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. వికెట్ కీపర్ రిషబ్ పంత్ 10 స్థానాలు ఎగబాకి కెరీర్ అత్యధిక 38వ ర్యాంక్‌ను సాధించాడు. అరంగేట్ర క్రికెటర్ మయాంక్ అగర్వాల్ కూడా బ్యాట్స్‌మెన్ జాబితాలో ప్రవేశించాడు. మూడో టెస్టులో 76, 42 పరుగులు చేయడంతో 67వ ర్యాంక్‌లో నిలిచాడు. జస్‌ప్రీత్ బుమ్రా మొత్తం తొమ్మిది వికెట్లు తీసుకోవడంతో 28వ ర్యాంక్ నుంచి 12వ ర్యాంక్‌ను చేరుకున్నాడు. దీంతో టెస్టుల్లో అత్యధిక ర్యాంక్ కలిగిన భారత బౌలర్‌గా నిలిచాడు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District. Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.